విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

బుధవారం 26 నవంబరు 2025 8 పేజీలు

రైతుల కష్టాలు!

- ధాన్యం కొనేవారు లేక ఇబ్బందులు
- ఆరబోసి రైతుల ఎదురుచూపులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణాజిల్లాలోని మొవ్వ మండలంలో పలు గ్రామాలలో ఎటు చూసినా ధాన్యం రాశులు, కాటా వేసి నెట్టు వేసిన ధాన్యం బస్తాలు, ధాన్యాన్ని ఆరబెట్టుకొని రైతులు దర్శనమిస్తారు.ఇ ధాన్యం కొనుగోలులో రైతులను ఏ విధమైన ఇబ్బందులు పాలు చేయవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేస్తున్న ప్రకటనలు అమలులో ఆమడ దూరంగానే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భట్లపెనుమర్రు, పెడసనగల్లు గ్రామాలలో ధాన్యం నూర్పిడి చేసిన రైతులకు రవాణాలారీల కొరత పట్టిపీడిస్తోంది. నాలుగైదు రోజులుగా అందుబాటు లోలేని లారీలతో చిన్న,సన్నకారు రైతులు, కౌలు రైతులు కాటా వేసిన తమ ధాన్యం బస్తాలు ఖాళీ ప్రదేశాలలో నెట్లు వేసుకొని కాపలాకాచుకొనే పరిస్థితి సంభవించింది. అయితే రైతులు మాత్రం రైతుసేవా కేంద్రాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలతో సంబంధం లేకుండా నేరుగా మిల్లర్ల వద్దకే వెళ్లి వారితో మాట్లాడుకుని సరఫరా చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా భట్లపెనుమర్రు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనటానికి

విచ్చేసినప్పుడు కొంతమంది రైతులు లారీలకొరత సమస్య ఆయన దృష్టికి తేగా రైతులే లారీలు మాట్లాడు కుని ధాన్యం సరఫరా చేసుకోవాలని రవాణాచార్జి ధాన్యం డబ్బులతోపాటు ఖాతాలకు జమ పడతాయని సూచించటంతో కొంతమంది ఆ బాటలో పయనిస్తు న్నట్లు తెలిసింది. కాగా గత రెండు సంవత్సరాలుగా ఖరీఫ్ సీజన్లలో ధాన్యం విక్రయాల సమయంలో భట్ల పెనుమర్రులో సమస్య రావడం పరిపాటిగా మారింది. లారీల కొరత, గన్నీ(గోనె సంచులు)ల కొరత మండలాల్లోని మిషన్ కోత కోసిన ప్రతి గ్రామంలోను కనబడుతోంది. ఈ దశలో తడిపొడి ధాన్యం బస్తాల మీద ఉంటే ముక్కిపోయే ప్రమాదం ఉందని ఆ రైతులు గగ్గోలు పెడుతున్నారు. అదే గ్రామంలో అంగడాల వెంకటేశ్వరరావు

-మిగతా 2 లో ...

హక్కులతో పాటు బాధ్యతలు ముఖ్యం

మంత్రి నారా లోకేష్

విశాలాంధ్ర-మంగళగిరి: అందరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు గురించి మాట్లాడతారు. కానీ బాధ్యతల గురించి ఎవరూ మాట్లాడరు. హక్కులతో పాటు బాధ్యతలు కూడా ముఖ్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రేపటి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైన మంగళగిరి విద్యార్థిని కూర్మాల శ్రీ కనకపుట్లమ్మను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు ఉండవల్లి నివాసానికి సదరు విద్యార్థినితో పాటు కుటుంబ సభ్యులను పిలిపించుకుని మాట్లాడారు. మంగళగిరి బీఆర్ నగర్ లోని మున్సిపల్ హైస్కూల్ లో 8వ తరగతి చదువుతున్న శ్రీ కనకపుట్లమ్మ పాఠశాలలో నిర్వహించిన

-మిగతా 2 లో ...

పట్టాభి స్మారక భవనాన్ని నిర్మిస్తాం

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య 146వ జయంతిని పురస్కరించు కొని సోమవారం జడ్పీ సెంటర్ లోని ఆ మహనీయుని కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ పేర్ని నాని ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరిట స్మారక భవనాన్ని నిర్మించి ఆ భవనం ద్వారా పేద ప్రజలకు వివిధ రకాల శిక్షణలు ఇచ్చి, పేదల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తా మని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పేర్ని నాని, వైసీపీ కార్పొరేటర్లు స్మారక భవన నిర్మాణానికి హైకోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయకుండా, యూనియన్ బ్యాంక్ వారు నిదులు ఇస్తామన్నా కూడా మచిలీపట్నం నగర కార్పొరేషన్ లో ఏ విధంగా పేర్ని నాని, వైసీపీ కార్పొరేటర్లు అడ్డుపడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇంక ఎంతో కాలం స్మారక భవన నిర్మాణానికి అడ్డుపడలేరని, ఇప్పటికైనా నిర్మాణం కోసం తీర్మానం చేస్తే వైసీపీ కార్పొరేటర్లకు బాగుంటుందని లేదంటే చరిత్ర హీనులౌతాలరని రాష్ట్ర మంత్రి

-మిగతా 2 లో ...

కంటి చూపుపై అప్రమత్తం

సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కంటి చూపు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. స్థానిక చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవాలయం వద్ద 'ఉచిత కంటి వైద్య శిబిరం' సీపీఐ నగర కమిటీ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ శిబిరానికి 29వ డివిజన్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరెడ్డి (సీపీఐ)అధ్యక్షత వహించారు. అనంతరం కోట మాల్యాద్రి మాట్లాడుతూ అన్ని అవయవాల్లో కెల్లా కళ్లు అత్యంత ప్రధానమైనవని పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు గుంటూరు నగరంలో 6 వేల మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. స్వర్ణభారతి నగర్, పాతగుంటూరు, ఏటి అగ్రహారం, చాకలిగుంట, ప్రగతి నగర్, సీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. పేద ప్రజల కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పేద ప్రజల ఉపయోగార్థం రాబోయే రోజుల్లో మరిన్ని ఉచిత కంటి వైద్య శిబిరాలు చేపడతామని, ప్రజలు ఆ ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోట మాల్యాద్రి కోరారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కళ్ళకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి సీపీఐ పార్టీ ప్రజలకు చేరువగా వైద్య సేవలు అందిస్తుం దన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య తలెత్తినా కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లోని

-మిగతా 2 లో ...

యాదవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

బోడె రామచంద్రరావుయాదవ్‌కు మంగళగిరి యాదవులు హెచ్చరిక

విశాలాంధ్ర-మంగళగిరి: బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్‌కు మంగళగిరిలోని యాదవ సంఘం నాయకులు, యాదవ సామాజిక వర్గం వారు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణుడి గుడి వివాదం పేరుతో మంగళగిరిలో పర్యటించి అనవసర రాద్ధాంతం చేయవద్దని, మంగళగిరి పర్యటనకు రావద్దని హితవు పలికారు. ద్వారకా నగర్ లో మంగళవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ యాదవ సామాజిక వర్గ ప్రయోజనాలకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణుడి గుడిని ఎవరూ కూల్చలేదని తెలిపారు. లేనిపోని అంశాన్ని వివాదం చేయాలని తద్వారా రాజకీయ లబ్ధికి ప్రయత్నిం చవద్దని అన్నారు. అలా కాకుండా మంగళగిరిలో కృష్ణుడి గుడి అంశాన్ని వివాదం చేసేందుకు వస్తే, పర్యటనను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో యాదవ సంఘం నాయకురాలు ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ, యాదవ సామాజిక వర్గం మొత్తం ఒకే తాటిపై ఉన్నారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం యాదవులను మభ్య పెట్టేందుకు కృష్ణుడి గుడి కోసం అంటూ స్థలాన్ని కేటాయిస్తున్నామని అసత్య ప్రచారం చేశారని

-మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

రైతుల కష్టాలు!

మూడు ఎకరాలు, గొర్రిపర్తి సాంబశివరావు ఐదు ఎకరాలు, పంది రామకృష్ణ ఐదు ఎకరాల 25 సెంట్లలో పండించిన పంటను బస్తాకు మద్దతుధర కంటే తక్కువకి ఇద్దామన్నా కూడా కొనుగోలుదారులు రాక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పెడసనగల్లులో వల్లూరిపల్లి కిషోర్‌బాబు పరిస్థితి ఇలాగే ఉంది. ఇదిగో వస్తాయి అదిగో వస్తాయి అంటూ ఐదు రోజులుగా సమాధానం చెబుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కొరత విషయంలో రైతుల దారుణ స్థితి వారి మాటల్లోనే..

పట్టించుకోని అధికారులు.. అంగడాల నగేష్, భట్ల పెనుమర్రు

కలెక్టరేట్లో అర్జీ ఇస్తే వచ్చేనెల 9వ తారీకు లో పరిష్కరిస్తామని రిసిప్ట్ ఇచ్చారు. అధికారులు కాని, ప్రజా ప్రతినిధులు కాని ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టవద్దని పత్రికా ముఖంగా ప్రచారాలు చేసుకుంటున్నారేతప్ప ఆచరణకు వచ్చేటప్పటికి అమలు లేదని ఇలాగే ధాన్యం బస్తాల రూపంలో కొంతకాలం ఉంటే పురుగుల మందు తీసుకోవాల్సిన పరిస్థితి.

కొనేవాళ్లు లేరు... వల్లూరు పల్లి కిషోర్ బాబు, పెడసనగల్లు.

గ్రామంలో ఆరుబయట నా 18 ఎకరాలలో కాటా వేసిన ధాన్యం నెట్టు వేసి ఉన్నాయి. ఐదు రోజుల నుంచి లారీలు రావటం లేదు. ప్రైవేటు వ్యాపారస్తులు కొనటం లేదు. ఇట్లాగే ఉంటే ధాన్యం ముక్కిపోయి చెడిపోయే ప్రమాదం ఉంది.

కంటి చూపుపై అప్రమత్తం

సీపీఐ నాయకులను సంప్రదించాలని కోరారు. తమ పార్టీ ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటుందని, వారికి భరోసా కల్పించటమే సీపీఐ పార్టీ ధ్యేయమన్నారు. తొలుత ఈ వైద్య శిబిరం నందు డాక్టర్ రవి కళ్ల ప్రాధాన్యత..కళ్ళు విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలు ముఖ్యం

వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహణకు సీఎం తో మాట్లాడి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థిని శ్రీ కనకపుట్లమ్మ భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేష్ ను కలవడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

పట్టాభి స్మారక భవనాన్ని నిర్మిస్తాం

కొల్లు రవీంద్ర అన్నారు. పట్టాభి సీతారామయ్య వ్యవసాయదారులకు రుణ సదుపాయంకల్పించడం కోసం అపార కృషి సల్పిన రైతు శ్రేయోభిలాషి అన్నారు. ఆయన ముక్కుసూటి మనిషిగా, స్వాతంత్ర సమరశీలిగా,మహాత్మాగాంధీ ఆప్తునిగా, రాజకీయ చతురునిగా ప్రజల మన్ననలు పొందిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జనసేన మచిలీపట్నం నగర అధ్యక్షులు గడ్డంరాజు, సింగరాజు గోవర్ధన రావు, ఎం. సుబ్రహ్మణ్యం, సేతు రామయ్య, విఎస్ఎస్ ఆర్ శర్మ తదితరులు, యూనియన్ బ్యాంక్ అధికారులు, ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

తెలిపారు. స్థానికంగా ఉన్న ఈ తరహా పరిస్థితులు మీకు తెలియదని, ఈ క్రమంలో మంగళగిరి పర్యటనను విరమించుకోవాలని ఆమె హితవు పలికారు. కావాలని కొందరు దురుద్దేశంతో ఈ అంశాన్ని రాజకీయం చేయాలని తద్వారా లబ్ధి పొందాలని, స్వ ప్రయోజనాల కోసం యోచిస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ ప్రాంతంలో కృష్ణుడి గుడి నిర్మాణం జరగకుండానే ఎలా కూల్చివేస్తారని ఆమె ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకే రామచంద్ర యాదవ్ నీచ రాజకీయాలకు తెర లేపారని అన్నారు.. యాదవ సంఘం నాయకులు చావలి ఉల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ ద్వారకా నగర్ లోని మంగళగిరి కి నడి బొడ్డున కృష్ణుడి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించారని అన్నారు. లోకేష్ సొంత ఖర్చులతో కృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం లో ఉన్న ఓ నాయకుడి చేత మాజీ ప్రజా ప్రతినిధి కోర్టులో కేసు వేయించారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తామే కేటాయించిన భూస్థలంపై, అదే పార్టీకే చెందిన వ్యక్తుల చేతనే కోర్టు కేసులు వేయించటం విచారకరమని నాయకులు తెలిపారు.కూటమి ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేని విషయాన్ని కట్టిపెట్టి విమర్శలు చేయటం ద్వారా వైసీపీ తమ విష రాజకీయాలను బయటపెట్టుకున్నట్లు అయ్యిందని వారు మండిపడ్డారు. అభివృద్ధి చేసే ప్రభుత్వం కూటమిదైతే.. కట్టడాలను కూల్చే ప్రభుత్వం వైసీపీదేనని వారు విమర్శించారు. ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎలాంటి తప్పుడు ప్రచారాలు తమ ధార్మిక విశ్వాసాలను లేదా అభివృద్ధి కార్యక్రమాలను దెబ్బతీయలేవని వారు స్పష్టం చేశారు.

ఎలక్ట్రానిక్ కాటాల తనిఖీ

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలంలో తూనికల కొలతల శాఖ అధికారులు మం గళవారం తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపధ్యంలో ధాన్యం విక్రయ సమయాల్లో కాటాల్లో మోసాలను నిరోధించే క్రమంలో అధికారులు తనిఖీలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఠా మేస్త్రిలు వేసే కాటాల్లో తేడాలుంటున్నట్లు రైతాంగం నుంచీ ఫిర్యాదులు వస్తున్న నేపధ్యంలో తనిఖీలు చేసి ఎలక్ట్రానిక్ కాటాలను సరిచూశారు. చల్లపల్లి మండలం యార్లగడ్డ, వక్కలగడ్డ, చల్లపల్లి తదితర గ్రామాల్లో ముఠా మేస్త్రీలు వేసే కాటాలు, రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాటాలను తూనికల కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. కాటాల్లో ఎలాంటి తేడాలను గమనిం చలేదని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తూనికల కొలతల శాఖ ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు, పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు, చల్లపల్లి ఏవో కె. మురళీకృష్ణ, సొసైటీల సీఈవోలు, వీఆర్వోలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రదేశాలను మరిన్ని పెంచండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పరిధిలోని వీధి కుక్కలకు ఆహారం ఏర్పాటు చేసే ప్రదేశాలను మరిన్ని పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ మంగళవారం టిక్కిల్ రోడ్డు, మొగల్రాజపురం, మదర్ తెరిసా జంక్షన్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డు, లయోలా కాలేజ్ రోడ్డు, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, వెటర్నరీ కాలనీ, గులాబీతోట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జంతు ప్రేమికుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆయా ప్రదేశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

ఏఐఎస్ఎఫ్ కృష్ణా జిల్లా కార్యదర్శి ఎండి సాధిక్‌బాబు

విశాలాంధ్ర-గన్నవరం : స్థానిక గన్నవరంలో ఉన్న రవీంద్ర భారతి విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల బిల్డింగ్ మొత్తం పెచ్చులు ఉడుతున్నాయి మరియు పాఠశాల ఆవరణంలో అసభ్యంగా ఉండటంతో విద్యార్థులందరూ కూడా చదువుకోవడానికి ఇబ్బందులు గురవుతున్నారని ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర కో కన్వీనర్ షణ్ముఖప్రియ మరియు కృష్ణాజిల్లా కార్యదర్శి ఎండీ.సాదిక్ బాబు అన్నారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులు వసూలు చేయడం తెలుసు కానీ విద్యార్థులు పట్ల మరి అంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు , ఏఐఎస్ఎఫ్ గన్నవరం నాయకత్వంగా పాఠశాలకు వెళ్లి తనిఖీలు నిర్వహించినప్పటికీ అక్కడ విద్యార్థులు వెళ్లడానికి బాత్రూమ్స్, తాగటానికి త్రాగునీరు కూడా లేకపోవడంతో విద్యార్థులంతా ఆందోళనకు గురవుతున్నారని , పాతబడిన బిల్డింగ్లో విద్యార్థులను చదివిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చలగాడుతున్నారని అన్నారు. వాళ్లు ప్రతి సంవత్సరం మా దగ్గర లంచాలు తీసుకుంటూ మాకు సహకరిస్తున్నారని మీరెవరు మమ్మల్ని అడగడానికి అంటూ ఏఐఎస్ఎఫ్ నాయకత్వంగా వెళ్ళిన నాయకులపై దాడికి పాల్పడ్డారు. తక్షణమే గన్నవరంలో ఉన్నటువంటి రవీంద్ర భారతి విద్యాసంస్థలపై క్రిమినల్ కేసు నమోదు చేసి, జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో గన్నవరం నాయకత్వం గా విద్యార్థులోకొన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనకు స్వీకారం చూడదామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం అధ్యక్ష కార్యదర్శులు రోహిత్, మౌనిష్, నాయకులు సందీప్, ధోని , ప్రిన్స్, సందీప్, కార్తీక్, ప్రమోద, అఖిల్, సునీల్, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : నేటి ఆధునిక ప్రపంచంలో వస్తున్న టెక్నాలజీ(సైబర్)నేరాలు పట్ల యువతతో పాటు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎకనామిక్ వీకర్ సెక్షన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాకి సునీత (ఐఏఎస్)తెలిపారు.మంగళవారం లెనిన్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచార ఉద్యమాన్ని సునీత ప్రారంభించారు.దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గడ్డం మాట్లాడుతూ ఈ నెల 25 నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి పిలుపుమేరకు ప్రచారం జరుగుతుందన్నారు.దళిత స్త్రీ శక్తి గత 19 సంవత్సరాల నుండి ఈ ప్రసార ఉద్యమాన్ని కొనసాగిస్తూ 20 సంలోకి అడుగు పెట్టిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో 16 రోజులు పాటు పాఠశాలలు, కళాశాలలు గ్రామాలు, మురికివాడలు, కంపెనీల్లో జెండర్ సమానత్వంపై సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకి సునీత (ఐఏఎస్) ప్రసార ఉద్యమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. దళిత శక్తి కృష్ణా జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసన్న వివిధ జిల్లాల నుండి మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ సృజన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగర పరిదిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, వాటర్, డ్రెయినేజీ చార్జీలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు పన్ను బకాయలు తెలియజేసి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ఖాళీ స్థలాలు, ఖాళీగానే ఉన్నాయా లేక ఇళ్లు నిర్మించారా, ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుగా మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఉందా లేదా, ఒకవేళ అదనంగా రూములు నిర్మించిన, ఫ్లోర్లు నిర్మించిన, ఆ మార్పుకు తగ్గట్టుగా పన్ను మార్చాలని, రెసిడెన్షియల్‌గా ఉన్న ఆస్తి కమర్షియల్‌గా మారితే దానికి తగ్గట్టుగా పన్ను వేయాలని ఆదేశించారు. అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కచ్చితంగా పూర్తి చేయాలని, అలాగే ప్రజలు కూడా సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, ఏయూబి.శర్మ, డి.శ్రీనివాస్, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సరెండర్

విశాలాంధ్ర-విజయవాడ: జల్ జీవన్ మిషన్‌తో పాటు వివిధ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమల్లో తీవ్ర అలసత్వం ప్రదర్శించినట్లు గుర్తించి, లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైన ఎన్‌టీఆర్ జిల్లా గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.విద్యాసాగర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు కలెక్టర్ జి లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెడెంట్ ఇంజనీర్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జ్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో వివిధ ప్రాజెక్టుల పనులకు అదనపు నిధులను మంజూరు చేసినప్పటికీ వాటిని ముందుకు తీసుకెళ్లడంలో విద్యాసాగర్ పూర్తిగా విఫలమయ్యారని కలెక్టర్ పేర్కొన్నారు.

హాస్పిటల్ డిస్చార్జ్ సమ్మరి పోయింది

మా తాతయ్య గారు **మరీదు. వెంకటేశ్వరరావు** గారికి విజయవాడ హెల్ప్ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ చేపించిన తర్వాత ఇచ్చిన డిస్చార్జ్ సమ్మరీ విజయవాడ నుండి నూజివీడు వచ్చే బస్సులో పోయింది. కావున ఎవరికైనా దొరికితే ఈ నెంబర్‌కి తెలియజేయగలరు.

మరీదు హరిబాబు,
ఫోన్ నెంబర్ 9966233299

సైబర్ నేరాలపై అప్రమత్తం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : సైబర్ నేరాలపై వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని ఎంఎస్ఎంఈ స్టేట్ కోఆర్డినేటర్ షేక్ అబ్దుల్ ముజీబ్ సూచించారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో ఫౌండేషన్ ఫర్ ఎంఎస్ఎంఈ క్లస్టర్, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ మోసాలు- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు గద్దం బాలవెంకట రవికుమార్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో షేక్ అబ్దుల్ ముజీబ్ మాట్లాడుతూ, రోజువారీ లావాదేవీల్లో ఫోన్పే, గూగుల్ ప్లే వాడటంలో తెలిసీ తెలియక చేసే పొరపాట్ల వల్ల ఎందరో వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణా ఆగ్రోస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు మూసివేత

విశాలాంధ్ర-ఉయ్యూరు : ఉయ్యూరు బైపాస్ రోడ్డు టీటీడీ కళ్యాణ మండపం వెనుక కృష్ణా ఆగ్రోస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును మండల తహసీల్దార్ మంగళ వారం మూసివేయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుకు వచ్చిన ధాన్యం వెంటనే దిగుమతి చేయకుండా రైతులను పిలిచి ధర విషయంలో ఇబ్బంది గురిచేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టరు అందిన ఫిర్యాదుల మేరకు తహసీల్దార్ మిల్లును తనిఖీచేసి రైతులనుండి ఇబ్బందులు తెలుసుకున్నారు. రైస్‌మిల్లు నిర్వాహకులు తమను పెడుతున్న ఇబ్బందులను తహసీల్దార్‌కు రైతులు తమగోడు వినిపించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం తీసుకువచ్చిన వాహనాల నుండి రోజుల తరబడి దిగుమతి చేయకుండా తేమ ఎక్కువగా ఉందని, తప్పతాలు ఉందని, రంగు మారిందని ఏవేవో కుంటి సాకుతో రైతులను ఇబ్బంది పెడుతూ ప్రభుత్వం కనీసమద్దతు ధరకంటే రెండు మూడు వందలు తక్కువకు తీసుకుంటూ నష్టపరుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల వెతలు విన్న తహసీల్దార్ ఆమేర తనిఖీచేసి మిల్లును తాత్కాలికంగా మూసివేయించి గేటుపై నోటీసు ఏర్పాటుచేశారు. అదేవిదంగా మిల్లును వెబ్సైట్లో కూడా బ్లాక్ చేయించామని తెలిపారు. రైతులు నిర్ణీ త ప్రమాణాల ప్రకారము తయారుచేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్ధతు ధర పొందాలని రైతులకు విజ్ఞప్తిచేశారు.

రోడ్డు ప్రమాదాల అవగాహన

విశాలాంధ్ర మచిలీపట్నం టౌన్ : జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారిపై బందరు డీఎస్పీ సిహెచ్. రాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు భద్రత మరియు రోడ్డు ప్రమాదాల నివారణ పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ రాజా మాట్లాడుతూ వాహనదారులు అందరూ రోడ్డు భద్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించి, తక్కువ వేగంతో వామనాలలో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, రోడ్డు ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వ్యక్తులను కోల్పోవడమే కాకుండా కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడటానికి రోడ్డు ప్రమాదాలు కారణమవుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ట్రాఫిక్ చిహ్నాలను గుర్తుంచుకొని దానికి తగిన విధంగా వాహనాలను నడపాలని తెలిపారు. వామనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబందనలు ఖచ్చితంగా పాటించాలని, ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక శ్రద్ద చూపాలన్నారు. వామనదారులు ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరిస్తూ ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం లేకుండా నడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బందరు డీఎస్పీ చప్పిడి రాజా, మరియు ట్రాఫిక్ సిఐ నున్న రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా అనుమతులకు కృషి : కాగిత

విశాలాంధ్ర-కృత్తివెన్ను : దాళ్వా పంట అనుమతుల కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నించానని నీటి గణాంకాల ప్రకారం అనుమతులు సాధ్యం కాలేదని పెడన శాసన కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రైతన్న సేవలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కాగిత ముఖ్యాతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు దాళ్వా పంట సాగుకు అనుమించాలని కోరారు. స్పందించిన కాగిత దాళ్వా పంటకు అనుమతులు సాధించేందుకు చివర వరకు ప్రయత్నం చేశానని రైతులకు వివరించారు. అయితే అందుబాటులో ఉన్న నీటి వనరుల దృష్ట్యా దాళ్వా సాగుకు సాధ్యం కాదని అధికారులు వివరించినట్లు తెలిపారు. ఒకవేళ దాళ్వా పంటకు అనుమతిస్తే మధ్యలో నీటికొరత వస్తే రైతులు నష్టపోతారని అందువలన తప్పని పరిస్థితిలో దాళ్వా పంటకు అనుమతులు ఇవ్వటం లేదని రైతుల అర్థం చేసుకోవాలని కోరారు. ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేసి రైతుల లాభాలు పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. సదస్సులు నిర్వహించి ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శశి కుమార్, ఎంపీడీవో ఎన్ శ్రీనివాసరావు, ఏఎంసి చైర్మన్, ఒడుగు తులసిరావు, డిసి చైర్మన్ నెక్కంటి విజయ భాస్కరరావు, వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల టిడిపి అధ్యక్షులు, నాగిడి చెన్నకేశవరావు, కూనపురెడ్డి వీరబాబు, కార్యదర్శి యాదిరెడ్డి కొండ, ఉపాధ్యక్షుడు సూరగాని బ్రహ్మం, కోమాళ్ళపూడి నీటి సంఘం అధ్యక్షులు కూనసాని శ్రీనివాసరావు, శివాలయం చైర్మన్ చేకూరి వెంకటరావు, కోమళ్ళపూడి పిఎసిఎస్ అధ్యక్షులు కూనసాని నాగబాబు, టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యులు కూనసాని చిన్నా, తమ్ముడు మురళి అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీపీటీ కొనుగోళ్లపై వదంతులు నమ్మొద్దు

రైతులకు స్పష్టం చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
నియోజకవర్గంలో రూ.1.23 కోట్ల విలువైన
513 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-మోపిదేవి: బీపీటీ ధాన్యం కొనట్లేదనే వదంతులు నమ్మవద్దని, నియోజకవర్గంలో ఇప్పటికి 513 మెట్రిక్ టన్నుల బీపీటీ ధాన్యం కొనుగోలు చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం మోపిదేవి మండలం రావివారిపాలెం, వెంకటాపురం, పెద్దకళ్లేపల్లి గ్రామాల్లో రైతులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కలిశారు. రావివారిపాలెంలో రైస్ మిల్లు సందర్శించి, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు గురించి వారితో మాట్లాడారు. బీపీటీ బియ్యం సక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లు రైతులు, మిల్లర్ తెలిపారు. మిల్లులో డ్రయ్యర్ల సౌకర్యం, ముఠా సౌకర్యం పరిశీలించిన ఎమ్మెల్యే రైతులకు మేలు చేసేలా సాధ్యమైనంత వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లరుకు సూచించారు. వెంకటాపురంలో రైతు సేవా కేంద్రం వద్ద సిబ్బంది, రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,04,064 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటికే 1,037 మంది రైతుల నుంచి రూ.16.89 కోట్లు విలువైన 7,468 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.16.81 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ఇందులో బీపీటీ ధాన్యం రూ.కోటి 23 లక్షలు విలువ కలిగిన 513 మెట్రిక్ టన్నుల ధాన్యం నియోజకవర్గంలో కొనుగోలు చేసినట్లు వివరించారు. జిల్లాలో రూ.5.80 కోట్లు విలువ కలిగిన 2,500 మెట్రిక్ టన్నుల బీపీటీ ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. బీపీటీ ధాన్యం గురించి ఎలాంటి వదంతులు రైతులు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.హరనాధ్, ఏవో హెప్సిబా రాణి, పీఏసీఎస్ చైర్మన్లు పరుచూరి శ్రీనివాసరావు, అరజా రాధిక, సర్పంచ్ తుమ్మా సోములమ్మ, వెంకటాపురం వి.ఏ.ఏ అనూష సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టండి : యార్లగడ్డ

ఎన్.హెచ్ పిడి కి యార్లగడ్డ విజ్ఞప్తి

విశాలాంధ్ర-గన్నవరం : చెన్నై- కోల్ కత్తా జాతీయ రహదారిపై గన్నవరం నియోజకవర్గం పరిధిలో నానాటికి పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జాతీయ రహదారుల సంస్థ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్ కు వినతి పత్రం అందచేశారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగిందని యార్లగడ్డ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను డిమాండ్ చేసారు. 65 నెంబర్ జాతీయ రహదారి బొమ్ములూరు టోల్గేట్ నుండి గన్నవరం ఆర్టీవో చెక్పోస్ట్ వరకు ఉన్న 33 కిలోమీటర్ల పొడవునా 2024 వ సంవత్సరం 102 ప్రమాదాలు జరగగా ఈ ఏడాది ఇప్పటివరకు 84 ప్రమాదాలు జరిగాయని చెప్పారు. ఈ 33 కిలోమీటర్ల పరిధిలోనే ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వీరవల్లి హెచ్పి ఆయిల్ బంకు వద్ద జాతీయ రహదారి మలుపు ఉండటంతో అక్కడ అధికవేగంతో వీళ్ళే వాహనాల వేగం కంట్రోల్ అవ్వక ప్రమాదాలు జరుగుతున్నాయాన్నారు. ముఖ్యంగా పెద్దావుటపల్లి ఫ్లైఓవర్ నుండి ఆర్టీవో చెక్పోస్ట్ వరకు రోడ్ ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో పాటు ప్రాణ నష్టం అధికంగా ఉందన్నారు. ఆర్టీవో చెక్పోస్ట్ సమీపంలో ఈ నెల 23వ తేదీ ఉదయం, రాత్రి ఒకేరోజు రెండు ప్రమాదాలు జరగటం ప్రమాదాల తీవ్రతకు అద్దం పడుతుందన్నారు. జాతీయ రహదారిపై వాహనాల అతివేగంగా వెళ్లడం ప్రమాదాలకు ఒక కారణంగా ఆయన పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల వద్ద, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. హనుమాన్ జంక్షన్ నుండి విజయవాడ వచ్చే వైపు పెద్దావుటపల్లి నుండి ఆర్టీవో చెక్పోస్ట్ వరకు జాతీయ రహదారి 1075 కిలోమీటర్ల నుండి 1077 కిలోమీటర్ల వరకు ‘ వై ‘ ఆకారంలో ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రమాదాలు నివారణకు వీలుంటుందని వివరించారు. అదేవిధంగా జాతీయ రహదారి పై పాఠశాలలు ఉన్న చోట్ల వాహనాల వేగ నియంత్రణకు మూవింగ్ బారికేడ్లు ఏర్పాటు చేయాలని, సర్వీస్ రోడ్లు ప్రారంభంలో క్యాట్ ఐ లు, రేడియం స్టిక్కర్లు, బ్లింకింగ్ రెడ్ లైట్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. సర్వీస్ రోడ్లు ప్రారంభం అయ్యే చోట్ల వాహన దారులకు కనిపించేలా సూచికలు ఏర్పాటు చేయాలని యార్లగడ్డ విజ్ఞప్తి చేసారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన కృష్ణాజిల్లా గన్నవరం మండలం, పురుషోత్తపట్నం గ్రామ కాపురస్తుడైన **పోతురాజు ఆనందరావు గారి కుమారుడు పోతురాజు మధుకి వారి తండ్రి గారైనా పోతురాజు ఆనందరావు గారు ది.05-12-1991** తారీఖునా **పోతురాజు సోమయ్య కుమారులు అయిన పోతురాజు ఇమ్మానుయేలు, ప్రసాద్ అనే భూషయ్య** కలసి **ది.15-5-1961**వ తారీఖు **దస్తావేజు నెం. 1684/1961 రు** గల విక్రయ దస్తావేజు రీత్యా శ్రీరంగనాయకులు వగైరాల వల్ల పొందిన **యు.0-50ట్లు** పురుషోత్తపట్నం స్థిరాస్తి ఇమ్మానుయేలు వారి సోదరులు కలసి 25 సంవత్సరముల క్రితం ముజువాణిగా పంపకాలు జరిగి ఇమ్మానుయేలు గార్కి రాబడిన ఆస్తి అయిన య.0.25ట్లు పురుషోత్తపట్నం ఆర్ యస్ 7 ఆస్తిని నా క్లైయింటు అయిన పోతురాజు మధుగారు తండ్రి పోతురాజు ఆనందరావు గారు **ది. 05-10-1991** తారీఖున విక్రయ స్వాధీనపు దస్తావేజు రీత్యా సంక్రమించి, వారి స్వాధీన, హక్కు బుక్కములతో ఉండియున్న నా ఈ ఆస్థిని మరియు 3 శెంట్లు స్థలం **ఆర్ యస్ నెం. 42/2రు, ఆర్ యస్ నెం.7రు యు.0-25ట్లు** ఆస్థి ని. **ది.29-10-2011** తారీఖున దఖలు దస్తావేజు **నెం.8916/2011** రుగా రిజిస్ట్రేషన్ పొంది - నాక్లెయింట్ అయిన పోతురాజు మధుగారు నాటి నుండి నేటి వరకు వారి సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో ఉండి నా ఆస్థికి వారు విక్రయ ఇచ్చుటకు బ్యాంకులోన్, మార్టిగేజ్ దఖలు పర్చుటకు ఇతర ప్రయోజన నిమిత్తం ఈ ఆస్థిపై ఎవ్వరికైనా అభ్యంతరములు తగాయిదాలు దావాలు వున్నాయెడల యీ తేదీలగాయితు 8 రోజులలోపు సెల్ నెం. **9951172447**కి తెలియవర్చగలరు. లేనియెడల మీ అభ్యంతరములు చెలనేరవు.

G.V.Ratnam, B.A., L.L.B., PGDCA (L.L.M.)
Advocate, D.No. 11-11A Islampet,
Gannavaram-521 101. cell: 9951172447

ఆక్వా డిజిటల్ ట్రేసబులిటిలో రైతులు భాగస్వాములవ్వాలి

విశాలాంధ్ర-గుడివాడ : ఆక్వా రైతాంగానికి ప్రయోజనం చేకూరేలా సిఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆక్వా డిజిటల్ ట్రేసబులిటీ శిక్షణ నందివాడ మండలంలో ప్రారంభం కావడం సంతోషకరమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం నందివాడ, తుమ్మలపల్లి, వెన్నెనపూడి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే రాము అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన సభల్లో మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి ఆక్వా డిజిటల్ ట్రేసబులిటీ ప్రాజెక్ట్‌లో నెక్ట్స్ ఆక్వా శిక్షణకు నందివాడ మండలంలోని అరిపురాల, రామాపురం, పుట్టగుంట, నందివాడ తుమ్మలపల్లి గ్రామాలు తొలి ఫేజ్‌లో ఎంపిక అయ్యాయన్నారు. ఈ శిక్షణ ద్వారా రైతాంగానికి గుర్తింపు సర్టిఫికెట్ అందుతుందన్నారు. ఆక్వా ఉత్పత్తులకు డిమాండ్ పెరగడమే కాక, అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. హేచరీస్ వద్ద నుండి, మేత కొనుగోలు, సాగు ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిపుణులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యమైనవారికి వచ్చే యూనిట్ ఐ.డిల ద్వారా రైతులకు అనేక రాయితీలలో వెసులుబాటు, సులభంగా రుణాలు పొందవచ్చన్నారు. రైతన్నలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలన్నారు. ఈ సమావేశాల్లో మండల టిడిపి అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, ఎండిఓ మల్లీశ్వరి, మత్స్యశాఖ ఏడి ప్రసాద్, ఎంపిడివో జయమ్మ, ఆర్ఐ ప్రసాద్, సిఐ సోమేశ్వరరావు, నాయకులు, పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని లాభసాటి చేయటమే ధ్యేయం

విశాలాంధ్ర -పమిడిముక్కల: వ్యవసాయ రంగాన్ని లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంచ సూత్రాలు సమగ్ర సమాచారం ప్రచారం చేయటమే ధ్యేయమని ఎడిఎ సునీల్ అన్నారు. మంగళవారం గోపువానిపాలెం లో రైతన్న....మీకోసం కార్యక్రమం పిపిపి సిబ్బంది తో ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం లో పంచ సూత్రాల నవశకానికి నాంది కానున్నదని ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు వంటి పథకాలతో రైతన్నలకు ప్రభుత్వం అందించే మద్దతును వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఎఒ పద్మావతి ఎఓ గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-తిరువూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేయాలని ఆదేశాలతో మంగళవారం పట్టణంలో 9వ వార్డు ఇంచార్జ్ చిట్టి పోతుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 500 సంతకాలు సేకరించి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామి దాసుకి అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ జెడ్పీ ఛైర్మన్ నల్లగట్ల సుధారాణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు చలమల సత్యనారాయణ, వైసీపీ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్ , పార్టీ వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.4.75లక్షలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మంటాడ లో వేంచేసియున్న అలివేలు మంగమ్మ పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం లో హుండీ లెక్కించగా రూ.4,79,549 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి వికెడి ప్రసాద్ తెలిపారు.దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి అనురాధ ఆలయ ధర్మకర్త ఎం.రామమోహన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైయినేజీపై ఉన్న ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో వర్షపునీరు రోడ్డుపైన నిలవకుండా డ్రైయినేజీ వ్యవస్థలో ఎలాంటి లోపాలకు తావులేకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. స్థానిక స్క్రూ బ్రిడ్జ్ వద్ద సర్వీస్ రోడ్లో గల డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలను, కృష్ణలంకలో ఉన్న అనధికార కట్టడాలను పట్టణ ప్రణాళిక సిబ్బంది మంగళవారం తొలగించారు. ఆయన మాట్లాడుతూ నగర పరిధిలోని డ్రెయినేజీలపై ఆక్రమణలు, అనధికార కట్టడాలు తొలగిస్తున్నామని, ప్రత్యేకంగా వర్షపు నీరు రోడ్డుపైన నిలువ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థలో సక్రమంగా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గమనించి అనుమతి లేనిదే భవనాలు నిర్మించరాదని, ఆగస్టు 31 కల్లా ఏమైనా అనధికార భవనాలు నిర్మిస్తే వెంటనే బిల్డింగ్ పినలైజేషన్ స్కీం ద్వారా దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మోహన్‌బాబు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంపై విచారణ చేయాలి

విశాలాంధ్ర, విస్సన్నపేట : విస్సన్నపేట వెలుగు కార్యాలయంలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని ప్రజాసంకల్ప వేదిక సభ్యులునిగామాను సూరిబాబు, వీరమల్లు రాంబాబు డిమాండ్ చేశారు. వెలుగు కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వెలుగు అధికారులు, సీసీలతో కలసి రుణాల మంజూరు సమయంలో మహిళల నుంచి పెద్దమొత్తం వసూళ్లు చేయటం, బుక్‌కీపర్ల జీతాలు ఎగ్గొట్టి, ప్రశ్నిస్తే కొత్తవారి వద్ద లంచం తీసుకుని నియామకాలు చేయటం వంటి పలు ఆరోపణలు చేశారు. ఈ విషయమై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, తమకు తెలియకుండానే విచారణ పూర్తి చేశారని తెలిపారు. ఈ విషయాలను పునర్విచారణ చేయాలని కోరగా, తాజాగా మరోమారు అధికారులు శోభన్‌బాబు, సురేష్ విచారణకు రాగా, వారిని కలసి సమగ్ర విచారణ కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెలుగు ఉన్నతాధికారులతో కాక, మరోశాఖ అధికారులతో విచారణ చేపడితే, పూర్తిస్థాయి వివరాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

డివిజన్ స్థాయిలో సోషల్ అడిట్‌పై శిక్షణ : ఎంఈఓ బాలాజీ

విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడ డివిజన్ స్థాయిలో సోషల్ ఆడిట్ పై సిఆర్ఎంటి లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఈఓ బాలాజీ తెలిపారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని ఫాదర్ బియాంకి పాఠశాలలో సోషల్ అడిట్‌పై 4 మండలల ఎంఇఓలు గూడపాటి డేవిడ్‌రాజు, సురేష్, గోపాలరావు, బాలాజీల అధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు, పెదపారుపూడి, గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు సంబందించిన సిఆర్ఎంటిలు, ఆర్‌పిలు బాపూజీరావు, శ్యాంప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం సిష్టర్ జి.జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూతతో సమకూరిన ప్రహరీ

విశాలాంధ్ర, విస్సన్నపేట : మండలంలోని నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువుల చొరవతో సమకూరుతున్న సదుపాయాలపై స్పందించిన దాతలు తమవంతు సాయంగా ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. హెచ్‌ఎం ఎస్.శోభాలత, వ్యాయామోపాధ్యాయుడు ఎం.రమేష్‌ల ద్వారా తెలుసుకున్న కలగర గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త దేశిరెడ్డి పుల్లారెడ్డి సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారు. తాము నిర్వహిస్తున్న నోస్చ్ సంస్థ ద్వారా ముందుకొచ్చారు. తమవంతు సాయంగా పాఠశాల చుట్టూ అవసరమైన ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. ఈ మేరకు దేశిరెడ్డి పుల్లారెడ్డిని తాజాగా పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

పారిశుధ్య నిర్వహణలో లోపం ఉండరాదు

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపం ఉండరాదని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సంబందిత అధికారులను ఆదేశించారు. స్తానిక వీఎంసీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సంబంధిత శాఖాధికారులతో మంగళవారం పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలు ఎప్పటికప్పుడు సేకరించాలని, సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్‌కు తొలగించాలని అన్నారు. రహదారులు పరిశుభ్రంగా ఉండాలని, ప్రధాన రహదారుల్లో ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే వాటిని పూర్తి చేయాలని, గుంతలు లేకుండా ప్యాచ్ వర్క్‌లు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలైనా, పారిశుధ్య నిర్వహణ అయినా సజావుగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ ఏ.శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతకు డ్వాక్రా మహిళల భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-కూచిపూడి : పరిశుభ్రమైన, పచ్చని గ్రామాలుగా తీర్చిదిద్దటానికి గ్రామాలలోని డ్వాక్రా మహిళలు సైతం తమ వంతు సహకారం అందించి భాగస్వాములు కావాలని ఎంపీడీవో దయాల సుహాసిని పిలుపునిచ్చారు. మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వెలుగు వివోలకు, డ్వాక్రా సంఘాలలోని ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన ఇద్దరేసి సభ్యులకు"క్లీన్ అండ్ గ్రీన్" పై ఒక రోజు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షత వహించిన ఈకార్యక్రమంలో మండలంలోని 21 గ్రామాల నుంచి ఎంపీక చేసిన ఇద్దరు వి.వో.ఏ.లు, ప్రతి పంచాయతీ నుంచి పాల్గొన్న డ్వాక్రా సభ్యులకు మొవ్వ మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని చెత్త నుండి సంపద సేకరణ కేంద్రంలో అవగాహన కల్పించారు.

రైతే రాజు : కొల్లూరి

విశాలాంధ్ర-అవనిగడ్డ : కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని మంగళవారం అవనిగడ్డ మండలం అశ్వరావు పాలెంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏఓ శుభ హారిక, అశ్వారావుపాలెం నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, గ్రామ మాజీ సర్పంచ్ కొండవీటి మధు, పార్టీ నేతలు దాసినేని సాంబయ్య, రేపల్లె నాగబాబు, కొండవీటి రవి తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణలో సింహాద్రి

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ మండలం పులిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మంగళవారం ఉదయం నుండి ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు హాజరై, కూరగాయల దుకాణాలు, ఫ్రూట్ షాపులు, ఆటో స్టాండ్, బస్ స్టాండ్ పరిసరాల్లో ప్రజలను వ్యక్తిగతంగా కలిసి సంతకాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైఎస్ఆర్సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండలం అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నలుకుర్తి రమేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చింతలపూడి బాల భాస్కరరావు (బాలు), పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంపై నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర, విస్సన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఉన్న అంబేడ్కర్ స్మృతివనంపై నిర్లక్ష్యం వహించటం తగదని వైసీపీ జిల్లా నాయకుడు సిరసాని ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి దిక్సూచిగా రాజ్యాంగాన్ని అందించి, ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగానికి నిర్మాతగా ఉన్న డా.బిఆర్.అంబేడ్కర్ పట్ల ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రపంచదేశాలు ఆయన మేధస్సును గుర్తించి, గౌరవిస్తుండగా, మన రాష్ట్రంలో సుందరంగా తీర్చిదిద్దిన స్మృతివనం నిర్లక్ష్యానికి గురవ్వటం దురదృష్టకరమన్నారు.

లింగ సమానత్వంతోనే మహిళా సాధికారత సాధ్యం : డీఆర్వో

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: లింగ సమానత్వం ద్వారానే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌కే ఖాజావలి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వద్ద డీఆర్డీఏ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు అరికట్టడానికి, లింగ వివక్షతను నిర్మూలనపై అవగాహన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మహిళలపై దాడులు అరికట్టడంతో పాటు వారికి స్వేచ్ఛ, సురక్షిత వాతావరణం కల్పించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ లింగ వివక్షతను అరికట్టడానికి సమాజంలో అవగాహన కోసం ప్రతిరోజు ఒక అంశంతో జిల్లా, మండల, గ్రామస్థాయిలో వివిధ రకాల కార్యక్రమాలను డిసెంబర్ 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థల్లో లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతస్థాయిలో నిర్వహిస్తామని వివరించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నగరంపాలెం సెంటర్‌లో మానవహారం నిర్వహించి జెండర్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా, ఐసిడిఎస్ పీడీ ప్రసున, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చెన్నయ్య, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమా బేగం, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులు, అంగన్వాడి కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జామియా మసీదు కమిటీ సభ్యుల ఆందోళన

విశాలాంధ్ర-తెనాలి: శివాజీచౌక్‌లో వందేళ్ల చారిత్రక జామియా మసీద్ కమిటీ నియామకంలో కొనసాగుతున్న ఆలస్యం, వక్ఫ్ బోర్డు తీసుకొంటున్న ఏకపక్ష నిర్ణయాలపై ఇరు కమిటీల సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ 2023 జూన్‌లో కమిటీల మధ్య నెలకొన్న మనస్పర్ధల కారణంగా ఇరు వర్గాల సభ్యులు స్టేట్ వక్ఫ్‌బోర్డుకు విన్నతి పత్రాలు సమర్పించారు. అనేకసార్లు వక్ఫ్‌బోర్డు అధికారులను కలిసి సమస్య పరిష్కారం కోరినప్పటికీ 2023-24 సంవత్సరాల్లో బోర్డు పునర్నిర్మాణం జరగకపోవడం వల్ల కమిటీ నియామకం ఆలస్యమవుతుందని అధికారులు తెలిపారు. స్టేట్ వక్ఫ్‌బోర్డు కొత్త కమిటీ నియామకం అనంతరం 2025 ఏప్రిల్‌లో జామియా మసీదును డైరెక్ట్ మేనేజ్మెంట్ కిందకు తీసుకున్నారు. గత 10 ఏళ్ళ ఆడిట్ నివేదికలు అందిన తర్వాతే కమిటీ ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. నవంబర్ 24న మాజీ అధ్యక్షుడు సుభాని తన పదవీకాలానికి చెందిన ఆడిట్ నివేదికలను సీఈఓకు అందజేశారు. ఇదే విధంగా మాజీ అధ్యక్షులు అయాజుద్దీన్, అబ్దుల్ నజీర్‌లు కూడా తమ ఆడిట్ నివేదికలను ముందుగానే సమర్పించారు. కాని కూటమి ప్రభుత్వం నియమించిన వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్‌బేగ్ వ్యవహారం కమిటీ సభ్యుల్లో ఆందోళనకు దారి తీసిందని, మసీదు కమిటీతో సంప్రదింపులు లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ, వక్ఫ్‌బోర్డు సమావేశంలో ఒక జారీ పత్రం విడుదల చేసి జామియా మసీదు పూర్తిగా తన ఆధీనంలో ఉందని మైక్ ద్వారా ప్రజల ముందు ప్రకటించడం సరైంది కాదని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య ఉన్న విభేదాలు తొలగిపోయిన నేపథ్యంలో మసీదు డైరెక్ట్ మేనేజ్మెంట్‌ను నిలిపివేయాలని, కమిటీని పునఃనిర్మించాలని వక్ఫ్‌బోర్డు, పౌరశాఖ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో మసీదు పెద్దలు, భక్తులు కలిసి బ్లాక్ రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

జ్యూట్ వస్తువుల తయారీలో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జ్యూట్ వస్తువుల తయారీలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జ్యూట్ వస్తువుల తయారీ మరియు మగ్గం వర్క్ లకు డిసెంబరు 10వ తేదీ నుండి, సిసిటివి ఇన్స్టలేషన్ కోర్స్ ల్లో డిసెంబరు 15వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఈ శిక్షణ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత, మహిళలు, సిసిటివి ఇన్స్టలేషన్ కోర్సుకు అర్హులన్నారు. ఉచిత శిక్షణలో ఉచిత భోజన సదుపాయము, ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని చెప్పారు. 19 నుండి 50 సంవత్సరాల వయసు కలిగి, ఆసక్తి కలిగిన వారు తమ వివరాలను యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్ 14-1-14 యూనియన్ గామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ చిరునామాకు సమర్పించాలని కోరారు. వివరాలకు 08632336912, 9700687696, 812539795 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మండలంలో ఎవరైనా అనధికార, అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు కే. మెహర్ కుమార్ సీఐ కే.వాసు హెచ్చరించారు. కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లచ్చన్న గుడిపూడి, మోతడక గ్రామాలలో అనధికారికంగా గ్రావెల్ తవ్వకాలు తవ్వి సొమ్ము చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ అనుమతి ఉంటేనే గ్రావెల్ తవ్వకాలు జరపాలన్నారు. గ్రామ రాజకీయాల వల్ల అనేకమంది గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్‌వోసీ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి బాధితలకు అందజేశారు. తాడేపల్లి 13 వ వార్డ్ కి చెందిన రావి హరిచందన కి రూ.1.30 లక్షలు, 19వ వార్డ్ కి చెందిన గంజగుంట్ల భాగ్యలక్ష్మికి రూ.1.50 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, మాజీ కౌన్సిలర్ కాటాబత్తిని నిర్మల,చల్లా శ్రీనివాస్, చల్లా రంగయ్య, సైకం సాంబయ్య, షేక్ బాజి,ఎస్కె సైదా, దామర్ల దుర్గారావు, కుందుర్తి కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకు స్కూల్స్ డైరెక్టర్లు సన్మానం

విశాలాంధ్ర-తాడికొండ: మండ లంలో వివిధ ప్రైవేట్ పాఠశాల లకు చెందిన డైరెక్టర్లు స్థానిక ఎస్.ఐ. జోజిని పోలీస్ స్టేషన్లో మంగళవారం ఘనంగా సన్మానిం చారు. ప్రైవేట్ స్కూల్స్ పరిసర ప్రాంతాలలో మద్యం, గంజాయి అసాంఘిక కార్యకలాపాలు ఏవైనా జరిగితే తన దృష్టికి తీసుకురావాలని జోజి డైరెక్టర్లను కోరారు. అలాగే పాఠశాలలో పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమను నేరుగా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ రాజ్ కుమార్, పి సాంబశివరావు, వై.కృష్ణారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వేమవరం గ్రామం సమీపంలో పెట్రోల్ బంకు వద్ద మంగళవారం జరిగింది. పోలీసులవివరాలు ప్రకారం చిలకలూరిపేటకు చెందిన సాతులూరి తిమోతి ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళుతున్నాడు. అలాగే నరసరావుపేట నుంచి గుంటూరు వైపు ఆర్టీసీ బస్సు వస్తుంది. పెట్రోల్ బంకు సమీపంలో బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సు బైకు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తిమోతికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ శివరామకృష్ణ సూచనల మేరకు ఎస్సై నవీన్ నాయక్ ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. గాయాలైన క్షత గాత్రుడిని 108 ద్వారా నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతులకు సంపూర్ణ రక్షణ కల్పించే నాయకత్వం చంద్రబాబు సొంతం: హరిబాబు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రైతుల సమస్యలపై స్పందించి వారికి సంపూర్ణ రక్షణ కల్పించే నాయకత్వం నారా చంద్రబాబు నాయుడు సొంతమని డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మేడికొండూరు మండల కేంద్రంలోని మేడికొండూరు గ్రామంలో అకాల వర్షాల కారణంగా పత్తి పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు మంత్రి కింజరపు అచ్చెం నాయుడుకు పూలబొకే అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల కొన్ని ప్రాంతాల్లో పత్తి పంట దెబ్బతిందని, దీంతో నష్టపోయిన రైతులు పట్ల కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించిందన్నారు. ప్రభుత్వ స్పందనతో రైతులకు ఎంతో ధైర్యం వచ్చినట్లుందని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

విశాలాంధ్ర-మంగళగిరి: మంత్రి నారా లోకేష్ ఆర్థిక సహకారంతో అమలవుతున్న స్త్రీశక్తి కార్యక్రమం కింద దుగ్గిరాల మండలంలో శిక్షణ పూర్తిచేసుకున్న 30 మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 74వ బ్యాచ్ మహిళలు 60 రోజుల శిక్షణ పొందగా, మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళలు మిషన్లు అందజేశారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం లోకేష్ లక్ష్యమని రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య తెలిపారు. భూలక్ష్మీ, షేక్ జబీన్, కేసంనేని శ్రీ అనిత, ఆశాలు, వైష్ణవి, యార్లగడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత డ్రైన్లు శుభ్రం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయాల వారీగా ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో తప్పనిసరిగా తమకు కేటాయించిన ప్రాంతంలో అంతర్గత డ్రైన్లను శుభ్రం చేయాలని, ఎస్ఎస్ ల వారీగా కేటాయించిన గ్రాస్ కటింగ్ మెషిన్ లతో డ్రైన్ల వెంబడి గడ్డి, పిచ్చి మొక్కల శుభ్రంపై శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ బ్రాడీపేట, లక్ష్మీపురం, అరండల్ పేట ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు. సిటి ప్లానర్ రాం బాబు, ఎస్ఈ(ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, వేణుగోపాల్, డిఈఈ సతీష్ కుమార్, ఏసిపి రెహ్మాన్, ఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

6,7 తేదీల్లో ఓపెన్ పికెల్ బాల్ టోర్నమెంట్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ ఆధ్వర్యంలో జిల్లా పికెల్ బాల్ సంఘం సహకారంతో డిసెంబర్ 6, 7 తేదీల్లో స్థానిక హనుమాన్ నగర్ ఒకటవ లైన్‌లోని వీవీ హెల్త్ హబ్‌లో గుంటూరు ఓపెన్ ప్రైజ్ మనీ పికెల్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ మన్నే, కార్యదర్శి వాణికుమారి నందిపాటి తెలిపారు. ఈ పోటీలు అండర్-14,16 మిక్సడ్, మహిళలు, సింగిల్స్, ఓపెన్ పురుషుల డబుల్స్ ఈవెంట్ పోటీలు జరుగుతాయన్నారు. గుంటూరులో పికెల్ బాల్ క్రీడాభివృద్ధి కోసం ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ముఖ్యంగా మహిళలు కూడా పాల్గొవాలని వారి కోసం ప్రత్యేకంగా కేటగిరీల వైజ్‌గా మహిళల సింగిల్స్ ఈవెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు తమ ఎంట్రీలను డిసెంబర్ 2వ తేదీ లోపు ఆనంద్ కుమార్ వాట్సాప్ కు 955333 5375 పంపాలని, సింగిల్స్ ఎంట్రీ ఫీ రూ.500, డబల్స్ కి రూ.1000 ఎంట్రీ ఫీజును ఫోన్ పే 8143783999 చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. మంగళవారం టోర్నమెంట్ పోస్టర్‌ను ఏపీ పికెల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్. శ్రీధర్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ మన్నే, కార్యదర్శి వాణి కుమారి నందిపాటి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ బి.అశోక, జిల్లా పికెల్ బాల్ సంఘం అధ్యక్షులు టి. హరి కిషన్, వివి హెల్త్ హబ్ అధినేత టి.పద్మావతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పికెల్ బాల్ సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, నిర్వాహ కార్యదర్శి కె.అరుణ్ కుమార్, కోశాధికారి కె.సుస్మిత, ఉపాధ్యక్షులు డాక్టర్ హనుమంతరావు, టి.మధుస్మిత, శిక్షకులు ఆనంద్ కుమార్, కె.రవి, ఎస్.శివారెడ్డి, సుబ్బారావు పసుపులేటి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ: ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు ఆత్రుతగా ఎదురుచూసే క్రిస్మస్ నెల మంగళవారం నుంచి ప్రారంభమైంది. ప్రతి ఏడాది డిసెంబర్ 25వ తేదీన జరుపుకునే యేసు క్రీస్తు జన్మదినం సందర్భంగా విశ్వాసులు సొంత క్లాజులు, రంగురంగుల లైట్లు, ముద్దైన నక్షత్రాలతో తమ ఇళ్లను అలంకరించుకుంటారు. ఈ నెల మొత్తం ఆనందం, భక్తి, సేవా కార్యక్రమాలతో నిండిపోతుంది. ప్రతి గ్రామంలో, పట్టణంలో చర్చిల ప్రాంగణాలు ప్రత్యేకంగా వెలిగిపోనున్నాయి. పిల్లలు క్రిస్మస్ కీర్తనలు పాడుతూ, పెద్దలు ప్రార్థనల్లో పాల్గొంటూ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇళ్ల ముందర క్రీస్తు పుట్టుకకు గుర్తుగా నక్షత్రాలను అమర్చి వెలిగించడం, రంగురంగుల లైట్లతో అలంకరించడం ఈ నెల ముఖ్య సంప్రదాయాలలో ఒకటి. డిసెంబర్ 24 రాత్రి జరిగే మిడ్‌నైట్ ఆరాధనతో ఉత్సాహం తారాస్థాయికి చేరుకోగా, డిసెంబర్ 25 తెల్లవారు జామున జరిగే ప్రత్యేక ఆరాధనతో పండుగ కార్యక్రమాలు చేరుకుంటాయి. ప్రేమ, శాంతి, క్షమ, సేవ భావాలకి ప్రతీకగా నిలిచే క్రిస్మస్ ముందస్తు ఏర్పాట్లతో ఇప్పటికే విశ్వాసుల ఇళ్లు పండుగ వాతావరణంతో కళకళలాడుతున్నాయి.

నరగాయపాలెంలో రైతన్న మీకోసం

విశాలాంధ్ర-వినుకొండ: మండలంలోని నరగాయపాలెం గ్రామంలో రైతన్న మీకోసంలో భాగంగా వినుకొండ పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్.ఎన్. శ్రీరాములు, వినుకొండ ఉద్యానవనాధికారి నబి రసూల్, మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి పాల్గొన్నారు. ఇందులో భాగంగా డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ శాఖ ద్వారా అమలుపరుస్తున్న సేవలను వివరించారు. ఉద్యాన వన అధికారి డ్రిప్పు, స్ప్రింక్లర్లు, పైపులు సబ్సిడీ మీద అందిస్తారని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ లబ్ధి గుర్చి వివరించారు. ప్రతి రైతు ఈ సర్వేలో పాల్గొనలని, వీటివల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతు సోదరులు ఏపీఎంఐపీ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐ హరిబాబు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల పోలీస్ స్టేషన్ నూతన ఎస్ ఐ గా ఎ.హరిబాబు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన నరసరావుపేట టుటౌన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీ పై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మణికృష్ణ బదిలీపై రాజుపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన హరిబాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

అలరించిన కూచిపూడి నాట్య ప్రదర్శన

విశాలాంధ్ర - దాచేపల్లి : రాష్ట్ర అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ పల్నాడు జిల్లా విభాగం సర్వసభ్య సమావేశం తాజాగా దాచేపల్లిలో జరిగిన విషయం విదితమే. అందులో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారిలో తంగెడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమ్మిరెడ్డి సీతారామిరెడ్డి కుమార్తె మహిత సహ పలువురు చిన్నారులు కూచిపూడి నాట్యంతో పాటు వివిధ రకాలుగా చేసిన ప్రదర్శనలు సభికులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. దాంతో వారందరినీ సభకు హాజరైన అతిథులతో పాటు నిర్వాహకులు కూడా అభినందించారు.

ఆసుపత్రిలో డిసిహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రమైన పెదకూరపాడులో సామాజిక ఆరోగ్య కేంద్రంలో పల్నాడు జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలు, సేవలపై ఆరా తీశారు. ఖాళీగా ఉన్న సర్జన్, అనస్థీషియా వైద్యులను సిహెచ్ సీకి కేటాయించడం జరిగిందని, వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు.. దస్త్రాలు, మందుల నిల్వలు పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. సిహెచ్సీ వైద్య అధికారి డాక్టర్ విద్య, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఘోర ప్రమాదంపై ప్రజాగ్రహం..

- విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర-కారంపూడి: పల్నాడు జిల్లా కారంపూడిలో వీరారాధన ఉత్సవాల్లో జరిగిన ఘోర ఘటనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు విద్యుత్తు శాఖ నిర్లక్ష్యం వలన ఒకరు ప్రాణాలు కోల్పోగా మరొకరు ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ ఉత్సవానికి వచ్చిన వేల సంఖ్యలో భక్తులు ఉత్తర కాశీగ పిలవబడే నాగులేరులో తల స్నానాలు చేయడం సాంప్రదాయం. ఇటువంటి నాగిలేరుపై భద్రతా ప్రమాణాలు పాటించకుండా విద్యుత్ వైర్లు ఉంచడం ప్రమాదం. ఆర్డీఎస్ పథకం కింద పట్టణంలో కొత్త పోల్స్, కొత్త వైర్లు వేసినప్పటికీ, వీరారాధన ఉత్సవ ప్రాంగణంలో నాగులేరుకు ఇరువైపులా పాత స్తంభాలపైనే ఆధారపడడం వల్ల ప్రమాదం సంభవించిందనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. ఈ నేపథ్యంలో సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ఒకరి ప్రాణం తీసింది. మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా, మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఎవరూ పరామర్శించకపోవడం చాలా బాధాకరం" అని ఆయన మండిపడ్డారు. అదే సమయంలో ఆయన ప్రభుత్వం పట్ల కీలక డిమాండ్లు చేశారు. మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం చేసి న్యాయం చేయాల న్నారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న అంకమ్మరావుకు అన్ని వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలన్నారు. పాత స్తంభాలు, వాడకంలోలేని లైన్లు ఉత్సవ ప్రాంగణంలో ఉండేలా వదిలేసిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్సవాలు, దేవాలయాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా పండుగగా నిర్వహించే కార్యక్రమం ఉన్న ప్రదేశం లోనే భద్రతా ప్రమాణాలు పాటించకపోతే, ఇలాంటి ఘటనలు మరెంత జరుగుతాయో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

స్మశాన వాటికల ఏర్పాటుపై డీపీఓ పరిశీలన

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : పులిచింతల పునరావాస గ్రామాలైన అయ్యప్ప నగర్, న్యూ వెల్లంపల్లి లను జిల్లా పంచాయతీ అధికారి ఎస్వి నాగేశ్వర నాయక్ సందర్శించారు. తమ గ్రామాల్లో స్మశానవాటికలు లేక పడుతున్న ఇబ్బందులపై గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్న నేపథ్యంలో డిపిఓ మంగళవారం ఆ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా పునరావాస గ్రామస్తులతో డిపిఓ విడివిడిగా సమావేశమై స్మశానవాటికలు ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే న్యూ వెల్లంపల్లి గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలో తరగతుల నిర్వహణకు స్థల యజమాని ఆటంక పరుస్తున్న సంఘటనపై క్షేత్రస్థాయిలో డిపిఓ వివరాలు సేకరించారు. తన స్థలానికి తనకు పునరావాస పరిహారం అందలేదంటూ గత కొన్ని రోజులుగా తల యజమాని పాఠశాలలో తరగతులు నిర్వహించేందుకు గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై డిపిఓ పూర్తి సమాచారం సేకరించి స్థల యజమానితో చర్చించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని న్యూ వెల్లంపల్లి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని గుత్తికొండ గ్రామంలో ప్రధాన ఆర్.అండ్.బి రహదారిని 39 మంది ఆక్రమించి షాపులు పెట్టిన ఘటనపై హైకోర్టు ఉత్తర్వులు మేరకు వాటిని తొలగించి ప్రత్యామ్నాయంగా మరొక ప్రదేశాన్ని చూపేందుకు ఉన్న పరిస్థితులను విచారించి ఆక్రమణదారుల వివరాలను సేకరించారు. ఎంపీడీవో ఎం నాగచంద్ర కుమారి డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు ఆయా గ్రామాల నాయకులు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జలాల్‌పురంలో ఎమ్మెల్యే భాష్యం పర్యటన

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధిలోని జలాల్ పురం గ్రామంలో మూడవ రోజు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటన కొనసాగింది. 100 రోజులు 100 గ్రామాలు పర్యటనలో భాగంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పుకు నేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా విని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సచివాలయం సిబ్బంది అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేలా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. 4 మంది అంగన్వాడి టీచర్లకు,11మంది ఆయాలకు నియామక పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. గ్రామంలో ఔటరింగ్ కోసం అవసరమైన భూ సేకరణ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య అత్తిమల రమేష్ బెల్లంకొండ రాంగోపాలరావు మాజీ సర్పంచి అత్తిపట్ల లక్ష్మీనారాయణ సరిపూడి గోపి మకర సాగర్ నెల్లూరు మల్లి కార్జునరావు గంగినే లీలావతి మేదరమెట్ల సోమ చౌదరి గంగినేని చిన్న గల్లా బాబురావు ఉమామహేశ్వరరావు పువ్వా నాగేశ్వరావు పాల్గొన్నారు.

26న నిరసన ర్యాలీనీ జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,కర్షక విధానాలకు వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నరసరావుపేటలో దేశవ్యాపిత నిరసన ర్యాలీ జరుగుతుందని సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను, కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చిందని అన్నారు. ఈ చట్టాలను సవరించి మరలా 44 చట్టాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా డైలీ వేజ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. స్వామి నాథన్ కమీషన్‌ను అమలు చేసి, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ నరసరావుపేటలో బస్టాండ్ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జరుగుతుందని అన్నారు. కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - నరసరావుపేట: చిలకలూరిపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సమైక్య రాష్ట్ర నాయకులు బి శ్రీను నాయక్ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో శీను నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళకు తెలియజేశారు. గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత ప్రధాన ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుల మేరకు తక్షణమే పధానోధ్యాయురాలను, ఇతర ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలన్నారు. అలా చేయని పక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్, గిరిజన సంఘ ఉపాధ్యక్షులు వి.కోటా నాయక్, పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న, విద్యార్థుల తల్లిదండ్రులు కాకాని రోశయ్య, తోపాటు పలువురు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర - దాచేపల్లి : గామాలపాడులో రూ.2 కోట్లతో నిర్మించతలపెట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అధికారులు తాజాగా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వానికి చెందిన రెవెన్యూ స్థలాన్ని ఎకరం నుంచి ఎకరంన్నర వరకు అవసరం కాసుంది. నగర పంచాయతీ సహా గ్రామీణ మండలం అంతటా వైద్య ఆరోగ్య శాఖ తాజా లెక్కల ప్రకారం 72 వేల మంది జనాభా ఉన్నారు. వారందరి కోసం నగర పంచాయతీ పరిధిలో దాచేపల్లి, నడికుడిలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. గ్రామీణ మండలానికి సంబంధించి దాచేపల్లిలో పాత పీహెచ్‌సీ ఉంది. అయినప్పటికీ ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించడానికి గామాల పాడులో మరో పీహెచ్‌సీ నిర్మించడం కోసం స్థల సేకరణ జరుగుతోంది. నగర పంచాయతీ పరిధిలో ఉన్న రెండు పీహెచ్ సీల్లోను వైద్యులు లేరు. దీని మూలంగా గ్రామీణ పీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరిగింది. ఓపీ నిత్యం 150 మందికి పైగా ఉంటోంది. ఇప్పటికైనా పట్టణ ఆసుపత్రులకు ఇద్దరు వైద్యులను నియమించాలి. పాత పిహెచ్ సీలో ట్యూబెక్టమీ శస్త్ర చికిత్సలు జరగడం లేదు. శిక్షణ పొందిన వాటి నిపుణులను (వైద్యులు) పంపి యధావిధిగా ఆపరేషన్లు చేయాలి. గతంలో నెలకు 30కు పైగా ఆపరేషన్లు జరిగాయి. అయితే వైద్యులు లేకపోవడంతో గర్భిణీలను గురజాల, నర్సరావుపేట ప్రభుత్వాసుపత్రులకు పంపుతున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయి. మిగతా సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బొల్లిముంత ముది మనుమరాలుగా పుట్టడం నా అదృష్టం

డా॥ బొల్లిముంత హారిక

విశాలాంధ్ర-తెనాలి: నా పేరు బొల్లిముత హారిక, నేను బొల్లిముంత శివరామకృష్ణ గారి ముదిమనుమరాలిని. నేను రష్యాలో యం.బి.బి.యస్. పూర్తి చేసి, అమెరికాలో డాక్టర్‌గా పనిచేస్తున్నాను. మా ముత్తాత బొల్లిముంత శివరామకృష్ణ గారు పుట్టిన రోజునే నేను పుట్టడం నా అదృష్టం. ఆయన జయంతి, వర్ధంతిలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలుచోట్ల జరపడం మా కుటుంబ సభ్యులందరినీ ఆహ్వానించడం ముది మనుమరాలిగా నాకు ఎంతో గర్వంగా, ఆనందంగా వుంది. ఆయన్ని గౌరవించే గొప్పగొప్ప వారందరినీ కలుసుకోవడం, వారు మా మీద అదే అభిమానాన్ని చూపడం, వారందితో కలసి ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఒక మరపురాని మరచిపోని అనుభూతి. మా నాన్న విజయ్, తాత బొల్లిముంత కృష్ణ గార్ల కంటే నాకు మా ముత్తాత గారితో అనుబంధం ఎక్కువ. మా ముత్తాత పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం లాంటి వాటికి వ్యతిరేకం అని విన్నా. అయినా నా పుట్టిన రోజు, ఆయన పుట్టిన రోజు నవంబర్ 27వ తేదీ కావడం వలన ఆయన ఎక్కడవున్నా వచ్చి మా ఇద్దరి జన్మదిన వేడుకలు జరిపించేవారు. అది నాకు గర్వ కారణం. ఆయన్ని రాష్ట్ర రాష్ట్రేతరంగా సన్మానాలు, అవార్డులు నిర్వహించేవారని అందరూ గొప్పగా చెప్పుకుంటారు. అదీ నా ఆనందం. తెనాలి, హైదరాబాద్, చెన్నైలలో జరి గిన సన్మానోత్సవాలకు నన్ను తీసుకెళ్ళారు. అది మరిచి పోలేని అనుభూతి. నేను, నా చెల్లెలు ఆయన రచనలు, సినిమాలు చూసి ఎంతో గర్వపడతాం. ఆయన బాటలో పయనించేందుకు ఉవ్విళ్ళూరుతాం. నాతో పాటు ఇరుగుపొరుగు పిల్లలకు అర్థమయ్యే రీతిలో కథలు, పాటలు, అనేక విషయాలు చెప్పేవారు. కమ్యూనిస్టు పార్టీ గొప్పతనం గురించి వివరించేవారు. ఆయన చెప్పిన కథనాలతో నేను కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితురాలినయ్యాను.

నిరాడంబరతకు ప్రతిరూపం..

ఆయనను తలచుకున్నప్పుడల్లా నిరాడంబరతకు అద్దం పట్టే ఆయన రూపం కళ్ళముందు మెదులుతుంది. తెల్లటి పంచె, లాల్చీ, చేతిలో చిన్న సంచి, సున్నితమైన మనస్తత్వం ఎవ్వరినీ నొప్పించని మాటలు అన్నీ గుర్తొస్తున్నాయి. మన సాంప్రదాయం గురించి, మానవతా విలువల గురించి చిన్నచిన్న కథలుగా మనసుకు హత్తుకునే విధంగా చెప్పేవారు. ఆయన చిన్నతనంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని ఆ ఊరిలో పెద్దలు కథలు కథలుగా చెబుతారు.

చదలవాడలో జననం..

1920వ సంవత్సరం నవంబరు 27వ తేదీన నేటి బాపట్ల జిల్లా, వేమూరు మండలం, చదలవాడ గ్రామంలో ఆంధ్ర సంస్కృత పండితులు, సంగీత విద్వాంసులు, విద్యా దాత, గాంధీయవాది బొల్లిముంత అక్కయ్య-మంగమ్మ దంపతులకు ఏకైక పుత్రునిగా జన్మించారు. ప్రాథమిక విద్య తండ్రి గారి వద్ద చదివారు. ఉన్నత విద్య కోసం ఆరు మైళ్ళు డొంకలు, కాలువలు దాటుకుంటూ వెళ్లి అనంతవరంలో 8వ తరగతి వరకు చదివారు. ఆర్థిక స్తోమత లేక పైచదువులు ఆపి టీచర్‌గా ట్రైనింగ్ పొందారు. పాఠశాల అనంతరం అచట నుండి నాలుగు మైళ్ళు దూరంలో వున్న వెల్లబాడు గ్రామం నడిచి వెళ్లి పిన్నమనేని వెంకటేశ్వరరావు వద్ద హార్మోనియం, సంగీతం నేర్చుకున్నారు.

చిన్నతనంలోనే సంగీత సహకారం..

గుంటూరులో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూ ఆర్టింగా హరికథలు, నాటకాలకు హార్మోనియం వాయించేవారు. ట్రైనింగ్ అనంతరం తండ్రి గారి పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. నాటకాలు నేర్పడం, వాడవాడలా ప్రదర్శనలివ్వడం చేసేవారు. పాదుకా పట్టాభిషేకం, శ్రీకృష్ణ రాయబారం, తెలుగుతల్లి తదితర నాటకాలు ప్రదర్శించేవారు. ఆ నాటకాలలో స్త్రీ పాత్రలు కూడా ధరించేవారట. త్రిపురనేని రామస్వామి గారి కవితా పరిచయంతో కథలు, కవితలు రాయడం ప్రారంభించారట. మాక్సింగోర్కీ రాసిన అమ్మ నవల స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ క్రియాశీల రాజకీయాలలో చేరారని చెప్పేవారు. కార్యకర్త నుండి నాయకుని స్థాయికి ఎదిగారు. ఆనాడు తెనాలి ప్రాంత గ్రామాల్లో బాల సంఘాలు, మహిళా, రైతుకూలి సంఘాలు ఏర్పాటు చేసి ప్రజా చైతన్యం కోసం కృషి చేశారు. కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, వివిధ సంఘాలకు జిల్లా నాయకులుగా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ

27 నుంచి 30వరకు సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ జయంతి వేడుకల సందర్భంగా..

నిషేధకాలంలో శ్రీకాకుళం జిల్లాలో సంగీత మాస్టారుగా రహస్య జీవితం గడిపారు. ప్రముఖ సినీ రచయిత ఆత్రేయ పిలుపుతో వాగ్దానం సినిమాకు పనిచేశారు. తిరుపతమ్మ కథ, మనుషులు మారాలి, మంచిరోజులొచ్చాయ్, కాలం మారింది, కల్యాణ మండపం వంటి సంచలనాత్మక చిత్రాలతో పాటు 50కి పైగా చిత్రాలకు రచయితగా పనిచేశారు. కాలం మారింది, నిమజ్జనం చిత్రాలకు రాష్ట్రపతి నుండి ఉత్తమ రచయిత అవార్డులు అందుకున్నారు. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు, నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చేతుల మీదుగా ఉత్తమ రచయిత అవార్డు అందుకున్నారు. ఆయన రచించిన అనేక చిత్రాలు శతజయంతి ఉత్సవాలు జరుపుకున్నాయి.

మృత్యుంజయులు సంచలనం..

తెలంగాణా సాయుధపోరాటం నేపధ్యంలో "మృత్యుంజయులు" తెలుగు సాహితీ రంగంలో సంచలనం సృష్టించిందనడం అతిశయోక్తికాదు. వందలాది కథలు, కవితలు, వ్యాసాలు, నాటిక, నాటకాలతో పాటు రేడియో, టి.వి.లకు సహితం అనేక రచనలు అందించారు. కన్నెగంటి హనుమంతు, కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుపై టెలీఫిలింకు రచనలు చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే కమ్యూనిస్టు పార్టీని జనంలోకి తీసుకెళ్లడానికి ఆయన చేసిన కృషి విశేషం. మా ముత్తాత గారు చదలవాడలో వుంటే ఆయనను కలవడానికి ఎప్పుడూ ఎంతోమంది వస్తూనే వుండేవారు. సినిమా రంగంలో ఎంతో మంది దర్శకులు, నటీ నటులతో ఆయనకు పరిచయాలు వుండేవట. నేను మా గ్రామం వెళుతున్నప్పుడు నేటికి అక్కడి వారు ఆయన సంస్మరణ సభల్లో ప్రముఖులు ఆయన గురించి చెప్పే సంగతులు వింటుంటే బాల్యంలో ముత్తాత శివరామకృష్ణ గారితో నా తీపి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి హృదయానందంతో నిండిపోతుంది.

వీవర్స్ కాలనీ స్థలాలకు విముక్తి

22ఏ జాబితా నుంచి తొలగింపులో మంత్రి లోకేష్ కీలక భూమిక

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి వీవర్స్ కాలనీ స్థలాలను 22 ఏ పరిమితుల జాబితా నుండి తొలగించేలా రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తీసుకున్న చొరవ కాలనీవాసుల్లో హర్షాన్ని నెలకొల్పింది. సంవత్సరాల క్రితమే కేటాయించిన భూస్థలాలు 22ఏ జాబితాలో చేరడంతో నిర్మాణాలు చేపట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వీవర్స్ కాలనీ కుటుంబాలకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించినట్లు నివాసితులు వెల్లడించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రజా సమస్యలను అతి తక్కువ సమయంలో పరిష్కరించే నాయకుడిగా లోకేష్ మరొకసారి నిరూపించుకున్నారని స్థానికులు ప్రశంసించారు. వీవర్స్ కాలనీ సమస్యను అనేక సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించని పరిస్థితుల్లో, మంత్రి లోకేష్ ప్రత్యక్షంగా వ్యవహరించి సమస్యను తీర్చడం పట్ల నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. వీవర్స్ కాలనీ నివాసితులు మాట్లాడుతూ ఇంతకాలంగా ఎవరూ చేయలేకపోయిన పని మంత్రి నారా లోకేష్ చేసి చూపారు. మా స్థలాలపై ఉన్న అడ్డంకులు తొలగిపోవడంతో ఇళ్ల నిర్మాణం, అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది.మంగళగిరి ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే నాయకుడు నారా లోకేష్ అని పేర్కొన్నారు. స్థలాల 22ఏ నుండి తొలగింపుతో వీవర్స్ కాలనీ అభివృద్ధికి కొత్త దారులు తెరచుకున్నాయని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయబడతాయన్న నమ్మకం వ్యక్తం చేశారు.

లైంగిక దాడులను అరికట్టాలి

విశాలాంధ్ర-తుళ్లూరు: సమాజంలో నానాటికి బాలలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ వైద్యాధికారి జ్యోతిర్మయి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కౌమార బాల బాలికలపై లైంగిక దాడుల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ అనురాధ మాట్లాడుతూ, పిల్లలను బాధ్యతగా పెంచడంతో పాటు వారి చుట్టూ ఉన్న సమాజం కదలికలపై బాల బాలికల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎఎన్ఎం,ఆశాలు ఇంటింటికీ తిరిగే క్రమంలో బాలబాలికల స్థితిగతులను గమనించాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్ఎస్ సిహెచ్ ఓ జి వెంకటరమణ,వైద్యాధికారి టి శివపార్వతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ ఎస్ కె మున్నా, హెల్త్ సూపర్ వైజర్ డి శ్రీనివాసరెడ్డి,హెల్త్ అసిస్టెంట్ ఎస్ కె కరీం,ఆరోగ్య కార్యకర్తలు, అంగన్ వాడీలు,ఆశాలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గురజాల వారి కోర్టులో

I.A. No. 328/2024 in I.A. No. 1152/2012, O.S. No. 4 / 2009

పిటీషన్,

1) వేముల వెంకట్రావమ్మ,

2) ఇల్లూరి మాధవి లత ....పిటీషనర్లు/వాదులు.

వర్సెస్,

1) వేముల నర్సిరెడ్డి, తండ్రి రామిరెడ్డి, హిందూ, 63 సంవత్సరములు, వ్యవసాయం, R/o. రామాపురం గ్రామం, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా.

2) మూడావత్ భీమా నాయక్, తండ్రి. సోమ్లా నాయక్,హిందూ, 51సం॥లు, వ్యవసాయం, R/o. బట్టువారిపాలెం గ్రామం, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా.

3) బొరెడ్డి ఆదిలక్ష్మి, భర్త. లింగారెడ్డి, హిందూ, 61 సం॥లు, గృహిణి, R/o.వైద గ్రామం, గురజాల మండలం, పల్నాడు జిల్లా.

4)ఆకుల వెంకటరావమ్మ, భర్త. కాశిరెడ్డి, హిందూ, 48సం॥లు, గృహిణి, R/o.రామాపురం గ్రామం, (శ్రీనగర్, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా.

5)వేముల వెంకటారెడ్డి, తండ్రి.నర్సిరెడ్డి, హిందూ, 40సం॥లు,వ్యవసాయం, R/o.రామాపురంగ్రామం, (శ్రీనగర్, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా.

6)వేముల వీరారెడ్డి, తండ్రి. నర్సిరెడ్డి, హిందూ, 38సం॥లు, వ్యవసాయం, రామాపురం గ్రామం, (శ్రీనగర్, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా.

.....రెస్పాండెంట్లు/ప్రతివాదులు.

పై నెంబరు దావాను పార్టిషన్ కొరకు మీపై దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు ప్రిలిమినరీ డిక్రీ ఇచ్చియున్నారు. దరిమిలా పిటిషనర్లు ఫైనల్ డిక్రీ కొరకు I.A.1152/2012ను దాఖలుచేసినారు. ఫైనల్ డిక్రీ పిటిషన్ లోని "A-షెడ్యూలు దాఖలా ఆస్తులోని 3వ ఐటమ్ ఆస్తిని బహిరంగ వేలం జరపమని పిటీషనర్లు I.A.328/2024ను దాఖలు చేయగా సదరు I.A.328/2024లో మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను తీసుకొనక ఆలస్యపరచుచున్నందున శ్రీ కోర్టు వారు వాయిదాను ది.5/12/2025కు మీయొక్క హాజరు నిమిత్తం వేసినారు. కావున రెస్పాండెంట్లు అయిన మీరు పై తేదీన పైకోర్టులో ఉ॥గం॥10:30ని॥లకు స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీకు గల అభ్యంతరాలు తెలియజేసుకొనవలసింది. లేనియెడల పిటిషన్‌ను మీ పరోక్షంగా తీర్మానించబడునని ఇందు మూలంగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది. 05/12/2025.

జె. నాగేశ్వర రావు, బికాం, బిఎల్.
పిటీషనర్ల తరఫున న్యాయవాది, గురజాల.

ట్రాక్టర్, బైకు ర్యాలీ జయప్రదం చేయండి: రాము

విశాలాంధ్ర - వినుకొండ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం వినుకొండ నియోజకవర్గం అధ్యక్షుడు కాకర్ల కొండలు అధ్యక్షతన స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో మంగళవారం రైతులతో సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ మోదీ 2014లో మేము అధికారంలోకి వస్తే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి ఇప్పటికి 12 సంవత్సరాల యిందని, ఈరోజుకి రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు కానీ రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని, రైతులు వాడే ఎరువుల ధరలు రెట్టింపయ్యాయని, కార్మికుల హక్కులను హరింపజేసే లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల స్వేచ్ఛను కాలరాయాలని చూస్తున్నారని, వీటన్నిటి పైన బుధవారం జరిగే కర్షక కార్మికుల ట్రాక్టర్ బైక్ ర్యాలీలను పల్నాడు జిల్లా రైతులు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. రైతు నాయకులు కాకర్ల వెంకటేశ్వర్లు, పెద్దారావు, బ్రహ్మం, లక్ష్మి, భద్రయ్య, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, కిరణ్, రామయ్య, సుబ్బారావు, నాగయ్య, మల్లయ్య, నరసయ్య పాల్గొన్నారు.

CHANGE OF SURNAME

I, SIVA MALLESWARI MARRAM REEDY (Old Name), W/o. **MARAM REDDY VENKATA REDDY**, Resident of Door No.8-25, Gowdapalem, Pedakakani Village and Mandal, Guntur District, Andhra Pradesh - 522509. I have changed my surname as **MARAM REDDY SIVAMALLESWARI** (New Name) W/o. **MARAM REDDY VENKATA REDDY**. Hereafter my surname is known as **MARAM REDDY SIVAMALLESWARI** (New Name) W/o. **MARAM REDDY VENKATA REDDY.**

CHANGE OF SURNAME

I, **VENKATA REDDY MARRAM REEDY** (Old Name), S/o. **MARAM REDDY BALI REDDY**, Resident of Door No.8-25, Pedakakani Village and Mandal, Guntur District, Andhra Pradesh - 522509. I have changed my surname as **MARAM REDDY VENKATA REDDY** (New Name) S/o. **MARAM REDDY BALI REDDY**. Hereafter my surname is known as **MARAM REDDY VENKATA REDDY** (New Name) S/o. **MARAM REDDY BALI REDDY.**

CHANGE OF MY NAME

I, Yalakaturi Jyothi (Old name), resident of Flat No.303, 5th floor, GV Doctors Plaza, Opp. Honda Showroom Room, Kothapet, Guntur - 522001, A.P. I have Changed my name as **Panchumarthy Jyothi (New name)**, W/o.Yalakaturi Srinivasarao. Hereafter my name is known as **PANCHUMARTHY JYOTHI (New name)**, W/o.Yalakaturi Srinivasarao.

మహిళలు సురక్షితంగా ఉన్నపుడే సమాజం అభివృద్ధి: డాక్టర్ రాజకుమారి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మహిళలు సురక్షితంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రముఖ గైనకాలజిస్ట్, అహల్య ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్ కాలేజీలో 'మహిళలపై హింస' అనే అంశంపై జరిగిన కార్యక్రమం జేఎంజె లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజకుమారి విద్యార్థినీలకు ప్రేరణనిచ్చే.. స్ఫూర్తి దాయకమైన సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస ఎంత చిన్నదైనా సహించేది లేదన్నారు. ఇంట్లోనైనా..బయటనైనా హింసకు బలవ్వకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎక్కువగా జరిగే ఆన్‌లైన్ అబ్యూజ్, సోషల్ మీడియా, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి ప్లాట్ ఫార్మ్‌లో అమ్మాయిలను మానసికంగా బాధపెట్టే మెజేజ్‌లు, ఫేక్ అకౌంట్స్, ఫొటో మిస్‌యూజ్‌లు కూడా హింసేనన్నారు. ఇలాంటి వేదింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే కంప్లైంట్ చేయాలని, మహిళల కోసం సైబర్ సెల్, శక్తి యాప్ లాంటి సపోర్ట్ సిస్టమ్స్ ఉన్నాయని, వాటిని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల కోసం ఉన్న చట్టాలను ఏవిధంగా ఉపయోగించుకోవాలో అవగాహన పెంచుకోవాలని, వాటిని తెలుసుకున్న మహిళలను ఎవ్వరూ దెబ్బతీయలేరని అన్నారు. కార్యక్రమంలో సెయింట్ జోసఫ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.స్వరూపరాణి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ టిఎఫ్. చంద్ర, లీగల్ అడ్వైజర్ సిస్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో అభివృద్ధిచెందాలి: మంత్రి

విశాలాంధ్ర-తెనాలి : ప్రతి మహిళా స్వశక్తి తో ఆర్థికంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం బాగుంటుందని పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు. కొత్తపేటలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో మంగళవారం మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మెప్మా సహకారంతో తెనాలి నియోజవర్గ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బొజ్జ సంధ్యారాణి మహిళలకు కుట్టు శిక్షణపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. డిసెంబర్ 1నుండి ప్రారంభంకానుందని అన్నారు. 45 రోజుల పాటు రోజుకు రెండు గంటలు శిక్షణ ఇవ్వబడుతుం దన్నారు. మహిళలు టైలరింగ్ నేర్చుకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపిడివో అత్తోట దీప్తి, మెప్మా సిబ్బంది, డిఆర్‌డిఏ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణ పరిధిలోని కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ (పురుషులు) టోర్నమెం ట్-2025 కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఆయన టోర్నీని ప్రారంభించి, ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. విద్యార్థులలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడం, శారీరక దృఢత్వం సాధించడం ఈ విధమైన కార్యక్రమాల ద్వారానే సాధ్యమని ఆయన అన్నారు. ఈ టోర్నమెంట్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న వివిధ కాలేజీల నుంచి పలు జట్లు పాల్గొన్నాయి. కాలేజీ అధ్యక్షులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

విశాలాంధ్ర-మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని సిపిఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళవారం మంగళగిరి పట్టణంలో సీపీఐ పదో వార్డు శాఖ సమావేశం నాయకులు బాపనపల్లి వెంకటేశ్వర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ, పార్టీ శతాబ్ది వేడుకల భాగంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే మహాసభకు సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల కోత, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, ధరల పెరుగుదలపై సిపిఐ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, పట్టణ మాజీ కార్యదర్శి పత్తేవరపు వెంకట శివ ప్రసాద్, పదో వార్డు శాఖ కార్యదర్శి బాపనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాట చూపండి మహా ప్రభో..

విశాలాంధ్ర-రాజుపాలెం: రెడ్డిగూడెం గ్రామపరిధిలోని వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం పొలాలకు వెళ్లుటకు దారిని ఆక్రమించి మూసివేయడం తో గ్రామరైతులు నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎస్.పి. లకు యాజమాన్యంపై వినతి పత్రం అందజేసినట్లు మంగళవారం రైతులు తెలిపారు. పొలాలకు వెళ్లే దారిని పూర్తిగా మూసేసి కోల్డ్ స్టోరేజి యాజమాన్యం దౌర్జన్యానికి దిగుతున్నారని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

మద్యం షాపులు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం,ఆరేపల్లి గ్రామాల్లో గల మద్యం షాపులను బుధవారం ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం షాపులు ముందు ఏపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు జరిగే విధంగా చూస్తామన్నారు.

సీపీఐ శత వసంతాల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపునిచ్చిన ఏకైక రాజకీయ పార్టీ సీపీఐ మాత్రమేనని, 2025 డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు కోరారు. మండలంలోని వేలూరు సీపీఐ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారి నుంచి దేశానికి విముక్తికి సీపీఐ విరోచితమైన పోరాటాలు చేసిందని, బ్రిటిష్ ప్రభుత్వ ఆగ్రహానికి గురై, ఆనాడు నిషేధానికి గురైందని గుర్తు చేశారు. ఎంతో మంది అమరవీరుల రక్తార్పణతో ప్రజల కోసం పోరాటాలు నిర్వహించి ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందు భాగాన నిలిచిన పార్టీ సీపీఐ మాత్రమేనని వివరించారు. పార్టీ ఆధ్వర్యంలో కార్మిక, విద్యార్థి, రైతు, మహిళా, వ్యవసాయ కార్మిక, యువజన తదితర అనేక ప్రజా సంఘాలను నిర్మించి ఆయా వర్గాల సమస్యల పరిష్కారాల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించిందని వెల్లడించారు. దేశం స్వతంత్రం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిర్వహించిన పోరాటాలను త్యాగాలను నేటి యువతరానికి గుర్తుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయని, నేటి యువతరానికి స్ఫూర్తిని నింపడమే లక్ష్యంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నియోజ కవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్మిక, విద్యార్థి, రైతు, మహిళా, వ్యవసాయ కార్మిక, యువజన విభాగాలకు చెందిన వారు విశేష సంఖ్యలో పాల్గొని సీపీఐ శత సంవత్సరాల ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ధనరాజ్, ఏలిక శ్రీనివాసరావు,బొంత తిరపతయ్య, సుబ్బారావు, నన్నే పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఒంగోలులోని బోధిధర్మ కరాటే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఈ నెల 23న కుంగ్‌ఫూ, కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణంలోని సీఆర్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న న్యూషావోలిన్ కుంగ్‌ఫూ అకాడమీకి చెందిన విద్యార్థులు కటా విభాగంలో బంగారుపతకాలు సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో వైభవ్, శశాంక్, షణ్ముఖ పతకాలు సాధించగా, జూనియర్ విభాగంలో సమీర్, అష్రఫ్, అఖిల్ సత్తాచాటి పతకాలు కైవశం చేసుకున్నారు. ఈ విద్యార్థులకు క్లబ్ ప్రాంగణంలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ మాస్టర్ బత్తుల విక్రమ్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా సీఆర్ క్లబ్ ప్రాంగణంలో విద్యార్థులకు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు కుంగ్‌ఫూలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాలికలు శిక్షణ పొందాలని సూచించారు. విద్యార్థులను అభినందించిన వారిలో సీఆర్ క్లబ్ ప్రతినిధులు హనుమంతరావు, కాళిదాసు, అకాడమీ మాస్టర్లు దరియావలి, యడ్ల సురేష్‌బీ షేక్ రబ్బాని పాల్గొన్నారు.

ఎన్ఎంయూ నుంచి ఈయూలోకి చేరికలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నిరంతరం పిటిడి (ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు పనిచేయుచున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ విధానాలు నచ్చి గుంటూరు-1 డిపోలో డిపో కార్యదర్శి రత్నాకర్ ఆధ్వర్యంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నుండి ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి కడియాల లక్ష్మయ్య, ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షులు కే.డి.ఈశ్వర్, ఎన్ఎం యూఏ ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ సెక్రటరీ కె.వి.యస్.నరశింహారావు, మాజీ జిల్లా కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసరావు (టోపి శ్రీను) వీరి ఆధ్వర్యంలో 70 మంది ఎంప్లాయిస్ యూనియన్‌లో మంగళవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.వి.నరసయ్య మరియు రాష్ట్ర, జోన్, జిల్లా నాయకుల సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా గుంటూరులోని సిపిఐ కార్యాలయం మల్లం లింగయ్య భవన్ నందు గుంటూరు జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ విస్తృత స్థాయి జిల్లా కౌన్సిల్ సమావేశము జిల్లా కార్యదర్శి ఇ.విజయకుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఛీఫ్ వైస్ డి.వి.స్వామి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.వి.నరసయ్య, రాష్ట్ర ఉప-ప్రధానకార్యదర్శి జి.నారాయణరావు, రాష్ట్ర కార్యదర్శులు ఎన్.వి.కృష్ణారావు, బి.టి.వల్లి,జోనల్ అధ్యక్షులు వాకా రమేష్ తదితరులు పాల్గొని వీరందరికి యూనియన్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

భక్తులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర-పెదకాకాని: మండల కేంద్రంలో మూడు ప్రధాన పుణ్యక్షేత్రాలు ఉండటంతో ప్రతి వారము వేలాది మంది భక్తులు ఇక్కడికి విచ్చేస్తున్నారని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ తెలిపారు. అయితే భక్తులకు, ముఖ్యంగా మహిళలకు పెదకాకాని గ్రామంలో ఎటువంటి పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం లాంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం వలన తీవ్ర అసౌకర్యానికి కారణమవుతోందన్నారు. యాత్రికులు ఇబ్బంది పడుతున్న సమయంలో గ్రామ ప్రజలను టాయిలెట్లు ఎక్కడ ఉన్నాయని అడిగి లేవని తెలుసుకొని ఇబ్బంది పడుతున్నారని మరీ ముఖ్యంగా ఆడపడుచులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని మహిళలు పురుషులు తమ అవసరాల కొరకు పెదకాకాని సెంటర్‌కు వచ్చిన తరుణంలో మూత్ర విసర్జన చేయుటకు కూడా వీలులేని పరిస్థితులలో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్థానిక మహిళలు వెంటనే మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని తెలిపారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పిడుగురాళ్లలో వందే భారత్ రైలు ఆగబోతోంది..!

విశాలాంధ్ర - పిడుగురాళ్ల : పల్నాడు జిల్లా ప్రజలకు రైల్వేశాఖ ద్వారా త్వరలో గొప్ప సౌకర్యం అందుబాటులోకి రాబోతుంది. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్లో వందే భారత్ రైలు నిలిపేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులుసూచన ప్రాయంగా అంగీకరించినట్లు రైల్వే బోర్డు సభ్యురాలు సభ్యురాలు కొంకా రాధ తెలిపారు. ఈ మేరకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఇటీవల రైల్వే అధికారులతో సికింద్రాబాద్‌లో జరిపిన చర్చల కృషి సఫలీకృతం కాబోతున్నాయి. అలాగే జడ్.ఆర్.యు.సీ.సీ సభ్యురాలు కొంకా రాధ పల్నాడు ప్రజల అభ్యర్థన వందేభారత్ రైలు నిలపాలన్న ఆకాంక్ష ఆచరణ రూపం దాల్చబోతుంది. ఎంపి ఇటీవల రైల్వే ఉన్నతాధికారులతో పల్నాడు ప్రాంత రైల్వే సమస్యలపై ప్రత్యేకంగా జరిపిన భేటీలో ట్రైన్ నెంబర్ : 20702 తిరుపతి-%సికింద్రాబాద్, 20701 సికింద్రాబాద్ తిరుపతి వందే భారత్ రైళ్లకు అదనంగా 4 బోగీలు మంజూరు అయ్యాయి. ఈ వందేభారత్ రైలు పిడుగురాళ్ల స్టేషన్ లో ఒక బోగి అదనంగా ఈ ప్రాంత ప్రయాణీకులకు రిజర్వేషన్ సౌకర్యం కొరకు అవకాశం కల్పించేలా అధికారులు అంగీకారం తెలిపినట్లు కొంకా రాధ తెలిపారు. పల్నాడు ప్రజలకు రైల్వే సేవలను అందించేలా ఎంపి లావు శ్రీ కృష్ణ దేవరాయలు కృషి, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారం, రైల్వే అధికారుల తోడ్పాటు మరువలేనిదని బోర్డు సభ్యురాలు కొంకా రాధ పేర్కొన్నారు.

సంక్షోభంలో సాగుకు సంక్షేమమే ఊతం



విశాలాంధ్ర-రెంటచింతల: సంక్షోభంలో ఉన్న సాగుకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే రైతుకు ఊతమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం రెంటచింతలలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు సాంకేతికతను అందిపుచ్చుకున్నప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. ఏ పంట మార్కెట్లో డిమాండ్ ఉందో తెలుసుకొని పంటలసాగు చేయాలని సూచించారు. వైకాపా పాలనలో అప్పులతో కూరుకుపోయిన అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో మేలైన విత్తనాలు,ఎరువులు అందించటంతోపాటు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించారని గుర్తుచేశారు. కార్యక్రమానికి ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏడిఏ జగదీశ్వర్ రెడ్డి,ఏఓ లక్ష్మారెడ్డి, తెదేపా నేతలు అబ్బిరెడ్డి, సుమంత్ రెడ్డి,,బోదపాటి రామకృష్ణ,మూలి రాజారెడ్డి, సిద్దయ్య, బ్రహ్మారెడ్డి, నరసింహారావు, హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబరు కోడ్‌లను తక్షణం నిలిపి వేయాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్లను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలులోకి తీసుకొని రావడం కార్మిక వర్గానికి ద్రోహం చేయడమే నని ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి అన్నారు. లేబరు కోడ్ లను అమలులోకి తీసుకొని రావడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాపితంగా అన్ని కార్మిక, రైతు సంఘాలతో కలిసి నిరంతరం ఐక్య ఆందోళనలను చేపట్టాలని ఇఫ్టు రాష్ట్ర కమిటీ ప్రచురించిన కరపత్రాలను విజయవాడ గాంధీనగర్‌లో విడుదల చేశారు.అనంతరం అయన మాట్లాడుతూ లేబరు కోడ్లు కార్మికుల క్షేమం కోరి తీసుకొని వస్తున్నామని మోదీ, గోడీ మీడియా చేస్తున్న ప్రచారం పట్టి బూటకం అన్నారు. ఇప్పటి వరకు 100 మంది కార్మికులు ఉంటే ఆ సంస్థలు లాకౌట్ చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉంది.కోడ్ల లో ఆ నిబంధన సడలించి 300 కి పెంచారు. అంటే 300 లోపు కార్మికులు పనిచేసే సంస్థల యజమానులు ఇష్టానుసారం లాకౌట్లు చేస్తామని కార్మికులను బెదిరించి లొంగదీసుకునే అవకాశం యాజమాన్యాలకు లభిస్తుందని అన్నారు. అలాగే నిర్ణిత కాల పరిమితి ఉద్యోగాలతో కార్మికుల ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. పిఎఫ్,

ఈఎస్ఐ అమలుకు నిర్ణయించిన కార్మికుల సంఖ్యను రెట్టింపు చేయడం ద్వారా లక్షలాది చిన్న పరిశ్రమల కార్మికులు సామాజిక భద్రతను కోల్పోతారని గుర్తు చేశారు. కార్మికులను సంఘటితం కానివ్వకుండా సంఘ నిర్మాణానికి అవకాశం లేకుండా కోడ్ రూల్స్ ఉన్నాయన్నారు. పరిశ్రమలలో కార్మి కులు ఎన్నుకున్న యూనియన్ ని కాకుండా యాజమాన్యాలు గుర్తించిన యూనియన్ లు ఒప్పందాలు చేసే అవకాశాలు వీటిలో కల్పించారని అన్నారు. లేబరు డిపార్ట్మెంటును దిష్టి బొమ్మ స్థాయికి దిగజార్చి కార్మిక అధికారులను కేవలం మధ్యవర్తుల స్థాయికి దిగజార్చుతున్నారని పేర్కొన్నారు. అన్ని విధాలుగా లేబరు కోడ్లు కార్పొరేట్లకు, యాజ మాన్యాలకు కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రాష్ట్రాలు లేబరు కోడ్ల కు సుముఖత వ్యక్తం చేయలేదని, నియమాలు రూపొందించలేదని అన్నారు.అయినా కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఫెడరల్ సూత్రాలకు విరుద్ధంగా నాలుగు లేబరు కోడ్లను అమలులోకి తెస్తున్నద న్నారు. కావున ఈ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేపు విజ యవాడలో ఉదయం 10 గంటలకు రైల్వే స్టేషన్ నుండి జరుగు ప్రదర్శనలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టు జిల్లా అధ్యక్షులు ముని శంకర్ నాయ కులు ఎస్ రమణ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలను బలోపేతానికి ప్రభుత్వంతో వాల్‌మార్ట్ వృద్ధి ఎంఓయూ

విశాలాంధ్ర, విజయవాడ : వాల్‌మార్ట్ వృద్ధి, దాని ప్రోగ్రామ్ భాగస్వామి ' ఐడియాస్ టు ఇంపాక్ట్ ఫౌండేషన్' ద్వారా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు %డ% వాణిజ్య శాఖతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేసింది. వాల్‌మార్ట్ వృద్ధి ద్వారా రాబోయే మూడు సంవత్సరాలలో ఉచిత శిక్షణ , వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వంతో రాష్ట్ర ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం సహాయపడనుందని వాల్‌మార్ట్ ఇంటర్నేషనల్ సోర్సింగ్, సప్లయర్ డెవలప్మెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాసన్ ఫ్రెమ్‌స్టాడ్ అన్నారు. విశాఖపట్నంలో జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సు 2025లో జరిగిన నిర్ణయం మేరకు తాజాగా ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. 2028 నాటికి అదనంగా 100,000 ఎంఎస్ఎంఈలను శక్తివంతం చేయడానికి వాల్‌మార్ట్ వృద్ధి ప్రయత్నాలలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మాస్టర్‌క్లాస్‌లు మరియు వర్క్‌షాప్‌లను నిర్వహించనుందని, ఫ్లిప్‌కార్ట్ మరియు వాల్‌మార్ట్ మార్కెట్‌ప్లేస్ వంటి దేశీయ మరియు అంతర్జాతీయ ఇ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలోకి ఎంఎస్ఎంఈలు చేరటానికి, తమ వ్యవస్థలను ఆధునీకరించడానికి, వ్యాప్తి చెందటానికి మరియు విస్తరించడానికి అవసరమైన సాధనాలతో వాటిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఏపి ఎంఎస్ఎంఈ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ పాలసీ (2024%-%29) – ఒక కుటుంబం, ఒక వ్యవస్థాపకుడు కింద ఎంఎస్ఎంఈ వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యంకు అనుగుణంగా ఈ కార్యక్రమం 2030 నాటికి వ్యవస్థాపక గృహ సంస్కృతిని నిర్మించే లక్ష్యానికి తోడ్పడనుందని చెప్పారు. ఈ అవగాహన ఒప్పందం పట్టు మరియు దుస్తులు, ఆహార ప్రాసెసింగ్ (జీడిపప్పు, కాఫీ మరియు సుగంధ ద్రవ్యాలు సహా), ఆభరణాలు, కృత్రిమ వజ్రాలు, ఇత్తడి వస్తువులు, కొబ్బరి పీచు , ఇంజనీరింగ్, హస్తకళలు మరియు చెక్క ఫర్నిచర్ వంటి ప్రాధాన్యతా క్లస్టర్లపై దృష్టి పెడుతుందని అన్నారు. విశాఖపట్నం, గుంటూరు మరియు కృష్ణాతో సహా జిల్లాల్లో ఈ విస్తరణ ప్రారంభమవుతుందని, తరువాత అనంతపురం, తూర్పు మరియు పశ్చిమ గోదావరి, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు మరియు ప్రకాశం వరకు విస్తరిస్తుందని తెలిపారు.

విభిన్న రీతిలో క్రిస్మస్ కేకు

యునైటెడ్ కాలేజ్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థుల ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట:- సెమీ క్రిస్మస్, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని యునైటెడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ప్రత్యేకంగా తయారుచేసిన వార్షిక కేకు మిక్సింగ్ విశేషంగా ఆకట్టుకుంది. మాచవరంలోని నార్లవారి వీధిలో నిర్వహిస్తున్న యునైటెడ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, చెఫ్ సిబ్బంది పాల్గొని పండగ వాతావరణంలో కేక్ మిక్సింగ్‌ను రూపొందించారు. డ్రై ఫ్రూట్స్, నట్స్, క్యాండీడ్ పీల్స్, సుగంధ మసాలా దినుసుల సంప్రదాయ మిక్స్‌తో ఆయా పదార్థాలను వైన్/రసాలతో మిళితం చేశారు. ఈ సందర్భంగా కాలేజ్ డైరెక్టర్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ, యునైటెడ్ కాలేజ్ ఆఫ్ హోటల్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ 2020లో ప్రారంభించామని నాటి నుండి ప్రతిఏటా క్రమం తప్పకుండా కేక్ మిక్సింగ్ తయారీని జరుపుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు తమ కళాశాల నుండి 1000కి పైగా విద్యార్థులు డొమెస్టిక్ మరియు ఇంటర్నేషనల్ ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు మంచి ఉజ్వల భవిష్యత్తు ఉందని చెప్పారు. ఇది ఆత్మ బంధంతో కూడిన వేడుకలను సూచిస్తుందన్నారు. అతిథులు శతాబ్దాల నాటి సంప్రదాయంగా కేక్ మిక్సింగ్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఎన్నో విషయాలు తెలుసుకుని ఆనందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేజ్ కరస్పాండెంట్ కరీమా, ప్రిన్సిపాల్ జంపన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

'థా పేస్ ఆఫ్ ద ఫేస్ లెస్ సినిమాకు విశేష ఆదరణ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : చాగంటి ప్రొడక్షన్స్ రిలీజ్ సిస్టర్ రాణీ యదార్థ గాథ "థా పేస్ ఆఫ్ ద ఫేస్ లెస్" సినిమాకు విశేష ఆదరణ లభిస్తుందని ప్రేక్షకులు,అభిమానులు తెలుపుతున్నారు.నగరంలోని గాంధీనగర్ జయరాం థియేటర్‌లో సెయింట్ అన్స్ నర్సింగ్ కాలేజి విద్యార్థులు, ప్రార్థన మందిరాల ఫాదర్లు కలిసి మంగళవారం సినిమాను తిలకించారు.గిరిజన ప్రాంతాల్లో క్రిస్టియన్ మిషనరి సంస్థలు చేస్తున్న సేవలను సినిమాలో అద్భుతంగా చూపించారని తెలిపారు.సిస్టర్ రాణీ యదార్థ గాథను ద ఫేస్ ఆఫ్ ద ఫేస్లెస్ పేరిట తెరకెక్కించారని వివరించారు.ఆమె జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రజలందరూ సంతోషంగా ప్రేమ,క్షమ,గుణం కలిగి జీవించాలని, ఆమె జీవిత చరిత్రతో ఇది తెలుస్తోందని చెప్పారు. ఈ సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్ యజమా నికి డిస్ట్రిబ్యూటర్ వారికి ఫాదర్లు సిస్టర్స్, కృతజ్ఞతలు తెలిపారు. ప్రదర్శనలో భాగం గా కృష్ణా జిల్లా, ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రేక్షకుల కోసం ఉదయం, సాయంత్రం ఆటలు మాత్రమే ప్రదర్శిస్తున్నామని మురళీధర్, శాంతయ్య లు తెలిపారు.

శ్రీ గౌరీశంకరస్వామి దేవస్థానంలో షష్టి మహోత్సవాలు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక గౌరీశంకరపురంలో వెంచేసి ఉన్న శ్రీ గౌరీశంకరస్వామి దేవస్థానం ఉప ఆలయమైన శ్రీవల్లి దేవసేన సమేత అనంత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. షష్టి వేడుకల్లో భాగంగా జరుగుతున్న స్వామి వారి దివ్యశాంతి కళ్యాణ మహోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో కందుల గోపాలరావు, ధర్మకర్తల కమిటీ సభ్యులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలి : కొమ్మారెడ్డి కిషోర్..

విశాలాంధ్ర-బంటుమిల్లి :- విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలని కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు . ఈ నెల 6-వ తేదిన "మన సంస్కృతి"ఆర్గనైజేషన్,హైదరాబాద్ వారిచే రాష్ట్రస్థాయిలో తెలుగు ప్రతిభా పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు.ఈ ప్రతిభా పరీక్ష ఫలితాలను ఈ నెల 24 వ తేదిన ప్రకటించటం జరిగిందన్నారు.ఈ ఫలితాలలో కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థిని కె.వర్ధిని (9 తరగతి) రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించిందన్నారు .ఈ సందర్భంగా కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల నడవడికలను భట్టి వారిభవిష్యత్తు ఉన్నత శిఖరాలకు చేరుతుందన్నారు .ఇంతటి ప్రతిభను కనబరిచిన విద్యార్థిని ని స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్,స్కూల్ సెక్రెటరీ మరియు కరెస్పాండెంట్ కె.యస్.వి.జి.శోభ,కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య,డైరెక్టర్ %డ% వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరిణి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు ,ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

చెకు ముకి పోటీల్లో గన్నవరం స్రవంతి విద్యార్థులు ఎంపిక



విశాలాంధ్ర-గన్నవరం : మచిలీపట్నంలో రామకృష్ణ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో గన్నవరం స్రవంతి హై స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు.ముగ్గురు విద్యార్థులు ప్రథమ స్థానం మరో ముగ్గురు ద్వితీయ స్థానం సాధించారు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు డిసెంబర్ 21నుంచి కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ కే రామకృష్ణ తెలిపారు.విద్యార్థులను ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

పిడిఎస్‌యు రాష్ట్ర 24వ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : పిడిఎస్‌యు రాష్ట్ర 24 మహాసభ లు ఈనెల 28,29 తేదీల్లో రాజమహేంద్రవరంలో అంబేద్కర్ భవన్‌లో రెండు రోజులు పాటు జరగబోతున్నాయి అని పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ తెలిపారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో మహాసభ లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సభలకు ప్రొఫెసర్ టి. సత్యనారాయణ ప్రారంభిస్తారని, వక్తలుగా ఏపి విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్ డి. రమేష్ పట్నాయక్ "విద్యారంగం శాస్త్రీయ దృక్పథం" సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు పి. టాన్యా జాతీయోద్యమంలో -విద్యార్థుల పాత్ర",విద్యారంగం సవాళ్లు -విద్యార్థుల కర్తవ్యాలు" ప్రసంగ పాఠాలు ఉంటాయి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలి.కానీ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో 2.50 శాతం మాత్రమే కేటాయించి మరోవైపు 2035 నాటికీ సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని మోడీ ప్రభుత్వం ఎన్ఇపి-2020 పేర్కొన్నారు. మోడీ పాలనలో లక్ష పాఠశాలలో రద్దు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో కూటం ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించవలసిన ఆరువేల కోట్ల ఫీజ్రాష్ట్రంలో కూటం ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించవలసిన ఆరువేల కోట్లు ఫిజు రియంబర్ మెంట్ బకాయిలు విడుదల చేయలేదు. సంక్షేమ హాస్టల్లో చదువు తున్న విద్యార్థులు పరిస్థితి గోరంగా ఉంది. విద్యార్థులు అద్దెభవనాలలో అరకొర సౌకర్యాలతో చదువు కొనసాగుతున్నాయి.మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ అంటే పేద, మధ్య తరగతి విద్యార్థుల కు వైద్య విద్యను దూరం చేయడమే అన్నారు. ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ సభలలో విద్యారంగ సంక్షోభం పై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించడానికి జరిగే పిడిఎస్ యు రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు ఆర్.వేణు, పి.వైష్ణవ్, కె.హేమ, మణికంఠ, బాను, రవిశంకర్, ఆసియా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

-ఎంపీ కేశినేని శివనాథ్

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లాలో రహదారుల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. రహదారుల అభివృద్ధి పై రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ను ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ ఉన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం లోని మున్నేరు పాత ఆనకట్ట వద్ద తాత్కాలికంగా రింగ్ బండ్లు ఏర్పాటుకు రూ. 71.45,, నందిగామ నియోజకవర్గంలో కంచెల ఎత్తిపోత్త పథకం అభివృద్ధి పనులకు రూ.15 కోట్లు , తిరువూరు నియోజకవర్గం వినగడప వద్ద వున్న కట్లేరు బ్రిడ్జ్ నిర్మాణం నిమిత్తం రూ.30 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. నందిగామ నియోజకవర్గంలో ప్రస్తుత రహదారులు వంతెనల పరిస్థితిని మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తీసుకువెళ్లారు. శిథిలావస్థలో ఉన్న ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో అనుసంధాన మార్గాలు, వంతెనల మరమ్మతుల అవసరాన్ని వివరించారని తెలిపారు. అలాగేజగ్గయ్యపేట నియోజకవర్గంలో గత ఏడాది సెప్టెంబర్ 2024, ఆగస్టు 2025లో కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో దెబ్బతిన్న రహదారులు, వంతెనల పునర్నిర్మాణం తో పాటు ఖరీఫ్ సీజన్ 2025-26కు పంటకు నీరు అందించుటకు మున్నేరు పాత ఆనకట్ట వద్ద నదిలో రింగ్ బండ్స్ వేయుటకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కోరారని అన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

క్రీస్తు ఆగమనంతో సర్వమానవాళికి సమాధానం

-న్యాయమూర్తి ఏ సత్యానంద్

విశాలాంధ్ర-విజయవాడ: క్రీస్తు మానవ రూపంలో యేసుగా ఈ లోకంలో జన్మించడంతో సర్వామానవాళికి మహా సంతోషం కలిగిందని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఏ సత్యానంద్ అన్నారు. డిసెంబర్ 25న క్రిస్మమస్‌ను పురస్కరించుకుని ది బెజవాడ బార్ అసోసియేషన్ హాల్‌ను క్రిస్మమస్ ట్రీ, స్టార్లతో అలంకరించి యేసు ఆగమనం దినోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభిం చారు. రెవ చాట్ల రాజశేఖర్ అడ్వెంట్ సీజన్‌ను ప్రారంభించి, ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి ఏ సత్యానంద్ 12వ అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్‌లకు క్రిస్మమస్ రోజుల ప్రాముఖ్యతను తెలియపరుస్తూ బైబిల్ పఠనం చేయించి ఆశీర్వదించారు. అనంతరం సత్యానంద్ మాట్లాడుతూ క్రీస్తు మనుషుల మధ్య ప్రేమ, సంతోషం , సమాధానం నిరీక్షణ వంటి అంశాలను నెలకొల్పారని వివరించారు. జడ్జి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ కాలంలో క్రైస్తవులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ పరస్పర అభినందనలు తెలుపుకోవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ కె బాషా, జనరల్ సెక్రెటరీ కె.వి రంగారావు, జాయింట్ సెక్రెటరీ వరాహ లక్ష్మీ పాల్గొనిఅభినందనలు తెలియజేశారు. ఈ శుభ సందర్భంగా క్రిస్మమస్ కేకును కట్ చేసి ఒకరికొకరు పరస్పరం క్రిస్మమస్ పండగ ఆగమన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాణా ప్రసాద్, మురళీకృష్ణ, రమేష్, బాపూజీ, సువర్ణ రాజు, పగడాల ఆంజనేయులు, షేక్ సుభాని, జాన్ విక్టర్, మహిళా న్యాయవాదులు జియా, నాగమణి, భార్గవి, బెజవాడ బార అసోసియేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వాకర్స్ ఉద్యమానికి ప్రభాకరరావు సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి, ప్రతినిత్యం నడక అలవాటు చేసుకుని సంతోషంగా జీవించాలనే ఆశయంతో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి ప్రభాకరరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం ఉదయం ఐజియం స్టేడియంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ నిర్వహణలో నడక మిత్రుల ఉద్యమానికి చక్కటి సేవలు అందిస్తున్న అధ్యక్షులు మోటూరి ప్రభాకరరావు అభినందనసభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన సంస్థ ప్రధాన కార్యదర్శి ఉయ్యూరు సాంబిరెడ్డి మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది, ప్రతినిత్యం వ్యాయామం చేస్తుంటే వైద్యునితో పనిలేదని అన్నారు. నిస్వార్థంగా సేవలు అందిస్తూ, సంస్థ నిధులను పెంపొందిస్తూ, లక్షలాది రూపాయలు సభ్యులనుండి విరాళాలు సేకరించి, ప్రతిభా వంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ప్రతి సంవత్సరం అందించడంలో ప్రభాకరరావు కృషి కొనియాడదగింది అన్నారు. వాకర్స్ పూర్వపు గవర్నర్లు అలమూరి అమర్నాథ్, తల్లం గంగాధరన్ అసోసియేషన్ ను క్రమశిక్షణగా నిర్వహించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రభాకరరావు సేవలు గుర్తించాలని అన్నారు. ఇదే వేదికపై సంస్థ కార్యవర్గ సభ్యులచే ప్రభాకరరావు వజ్రోత్సవ(75వ) జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సభలో బత్తుల నాగమల్లేశ్వరరావు, బాకీ సంజీవరావు, వనమా విశ్వేశ్వరరావు, వాకర్స్ గవర్నర్ అత్తులూరి విజయలక్ష్మి, భారతి, రెడ్డం వెంకటరెడ్డి, బోడి ఆంజనేయ రాజు, పలువురు వాకర్స్ మిత్రులు, బంధువులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 15వ ఎడిషన్ ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): ప్రపంచంలో అతిపెద్ద బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటిగా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, భారతదేశ గొప్ప సాంస్కృతిక వైభవంలో వివాహాభరణాల ప్రాముఖ్యతను ఎప్పటి నుండో అర్థం చేసుకుంటూ ఉన్నది. ప్రతి వధువు సంప్రదాయాన్ని గౌరవిస్తూ, స్వచ్ఛత, నిష్ఠ, నైపుణ్యం కలబోసి, ఎంతో శ్రద్ధగా ఎంపిక చేసిన మరియు ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన వివాహాభరణాలను అందిస్తుంది మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్. దేశంలోని అన్ని ప్రాంతల వధువుల ప్రత్యేక సంప్రదాయాలను గౌరవించేలా, అత్యంత నైపుణ్యంతో, సాటిలేని ఆభరణాలను తీర్చిదిద్దడంలో, అపూర్వమైన వారసత్వాన్ని సృష్టించింది మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్. ఒక ప్రధాన మైలురాయిని నమోదు చేస్తూ, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' 15వ ఎడిషన్ ప్రచారాన్ని ఆవిష్కరించింది. ఈ ఏడాది ఈ ఎడిషన్‌లో మొత్తం 22 మంది వధువులు, 10 మంది ప్రముఖులు.. ఎన్టీఆర్, కార్తి, ఆలియా భట్, కరీనా కపూర్ ఖాన్, అనిల్ కపూర్, శ్రీనిధి శెట్టి, రుక్మిణి మైత్ర, సబ్యసాచి మిశ్రా, ప్రార్థన బెహెరే, మనసి పారేఖ్ పాల్గొనడంతో, ఈ ప్రచార స్థాయి, వైవిధ్యం, భావోద్వేగ గాఢత ప్రతిబింబిస్తాయి.

ఆరుగాలం కష్టం రైతు కంట కన్నీరు

విశాలాంధ్ర-కంకిపాడు : ఆరుగాలం కష్టం తో పండించిన పంట వర్షానికి తడిసి రంగు మారడంతో కొనడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారని రైతు కష్టమర్ తో చెప్పుకోవాలని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నెప్పల్లి కుందేరు కోలవెన్ను రైతులు పంట రోడ్లపై ఆరబోసి రాజకీయ పైరవీలు చేయలేక పంట ఆరబెట్టుకుంటూ దీనంగా ఎదురుచూస్తున్నారు. సేకరించిన వివరాలు ప్రకారం తుఫాను ప్రభావం వల్ల ఇప్పటికే పంట దెబ్బతినగా ఉన్న పంటను కాపాడుకునేందుకు తీవ్ర ఆందోళనలో రైతులు ఉన్నాయి. ఆ పార్టీ అధికారం ఉన్నప్పుడు వాళ్ళ అను కూల రైతులకు ఇప్పుడు కూటమి అధికారంలో వీరి అనుకూలురకు పంట ఎగు మతి చేస్తున్నారు తప్ప రాజకీయ నేపథ్యం లేని వర్గాల రైతులు దేవుడి మీద భారం వేసే ఎదురుచూస్తున్నారని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ప్రాధాన్యత క్రమంలో రైతులను ఆదుకుని ఎలాంటి ఇబ్బంది కలక్కుండా క్రమ పద్ధతిలో రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.